జాతీయ తెలుగు దినపత్రిక

NIZAMABAD EDITION

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

నిజామాబాద్ బుధవారం 26 ఆగస్టు 2026 సంపుటి : 16 సంచిక : 205 పేజీలు : 8 వెల : 1/- RNI No. TELTEL/2010/35558

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జిలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు
9440231967

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయణం సూర్యోదయం: 5.42 । సూర్యాస్తమయం: 6.22 చంద్రోదయం: 4.57 । చంద్రాస్తమయం: 5.20 తిథి: బహుళ చతుర్దశి రా. 1.37 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: పుష్యమి సా. 10.23 వరకు, తదుపరి ఆశ్లేష యోగం: సిద్ధి రా. 8.18 వరకు, తదుపరి వ్యతీపాత కరణం: భద్ర మ. 2.45 వరకు, తదుపరి శకుని రా. 1.37 వరకు, తదుపరి

Published from : NIZAMABAD, WARANGAL, RANGAREDDY, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com




## ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి

### కామారెడ్డి జిల్లాపర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

### పచ్చదనం పెంపొందించి పర్యావరణ సమతుల్యతను కాపాడాలి

### మొక్కల పెంపకంతో పచ్చని భవిష్యత్తుకు బాటలు వేయాలి అదనపు కలెక్టర్ విక్టర్

**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 25 (ప్రజా జ్యోతి)**

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, పచ్చదనాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని అదనపు కలెక్టర్ విక్టర్ పిలుపునిచ్చారు. మొక్కల పెంపకంతో పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ భావితరాలకు పచ్చని భవిష్యత్తును అందించవచ్చని తెలిపారు.

వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం కామారెడ్డి మండలం రాఘవపూర్ గ్రామం లో డీఎఫ్ఓ నీరజ్, డీఆర్డీఓ దామోదర్ రెడ్డి, ఎక్సైజ్ శాఖ ముకుంద రెడ్డి, అధికారులు, గీత కార్మికులతో కలిసి అదనపు కలెక్టర్ విక్టర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రాఘవపూర్‌లో 1,200 ఈత మొక్కలను నాటారు. అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో వన మహోత్సవం కింద చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా రాఘవపూర్‌లో 1,200 ఈత మొక్కలు నాటినట్లు తెలిపారు. జిల్లాలో వివిధ శాఖలకు కేటాయించిన మొక్కలు నాటే లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో మొక్కలు, అడవులు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు పచ్చదనాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. వన మహోత్సవాన్ని కేవలం మొక్కలు నాటే కార్యక్రమంగా కాకుండా, ప్రకృతి పరిరక్షణలో ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, అవి వృక్షాలుగా ఎదిగే వరకు సంరక్షించాలని పిలుపునిచ్చారు. నాటిన ప్రతి మొక్కను కాపాడినప్పుడే వన మహోత్సవం లక్ష్యం నెరవేరుతుందని తెలిపారు. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని నిర్మించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ రవి తేజ, అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ ఎన్.వై. గిరి, తహసీల్దార్ హిమబిందు, పీడీ మెప్మా శ్రీధర్ రెడ్డి, అటవీ శాఖ అధికారులు, ఎక్సైజ్ శాఖ అధికారులు, గీత కార్మికులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## పచ్చదనం కోసం మన అడుగు

### భవిష్యత్ తరాల కోసం మన బాధ్యత

### వనమహోత్సవంలో స్వయంగా మొక్కలు నాటిన జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర, ఐపీఎస్

### మొక్కలు నాటడమే కాదు.. వాటి సంరక్షణ కూడా ప్రతి ఒక్కరి బాధ్యత

### పచ్చని కామారెడ్డి నిర్మాణానికి ప్రజలు, యువత, విద్యార్థులు భాగస్వాములు కావాలి



**కామారెడ్డి, టౌన్ ఆగస్టు 25 ప్రజా జ్యోతి**

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించాలని కామారెడ్డి జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కామారెడ్డి జిల్లాలో నిర్వహించిన ప్రత్యేక వనమహోత్సవ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్వయంగా మొక్కలు నాటి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నేటి సమాజంలో పర్యావరణ పరిరక్షణ ఎంతో కీలకమైందని అన్నారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల నేపథ్యంలో పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని పేర్కొన్నారు. మొక్కలు నాటడం వల్ల మనకు మాత్రమే కాకుండా భవిష్యత్ తరాలకు కూడా ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణం అందుతుందని తెలిపారు. వనమహోత్సవం సందర్భంగా మొక్కలు నాటడంపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను కూడా - మిగతా4లో

## పొంగిపొర్లుతున్న పోచారం...

## నిజాంసాగర్ కు కొనసాగుతున్న వరద



**ఎల్లారెడ్డి / నాగిరెడ్డిపేట, ఆగస్టు 26:** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో నిజాంసాగర్ ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్టు పూర్తిస్థాయికి చేరి పొంగిపొర్లుతుండటంతో ఆ నీరంతా నిజాంసాగర్‌కు చేరుతోంది. ఇరిగేషన్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంసాగర్ ప్రాజెక్టుకు ప్రస్తుతం 3,860 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తోందని . ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405.00 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 1,401.32 అడుగులుగా ఉంది. పూర్తి సామర్థ్యం 17.802 టీఎంసీలకు గాను ప్రస్తుతం 12.857 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత ఏడాది ఇదే రోజు 1,404.43 అడుగులు నమోదైంది. ప్రస్తుతం స్పిల్ వే గేట్లు, జెన్ కో, ప్రధాన కాలువ ద్వారా నీటి విడుదల లేదని, ఆవిరి రూపంలో మాత్రమే 206 క్యూసెక్కులు తగ్గుతోందని అధికారులు వెల్లడించారు. మరోవైపు సింగితం రిజర్వాయర్ కు 975 క్యూసెక్కుల ఇన్ ఫ్లో రాగా, అదే మొత్తాన్ని నిజాంసాగర్ ప్రధాన కాలువకు మళ్లిస్తున్నారు. కల్యాణి ప్రాజెక్టుకు 331 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తోంది. పోచారం ప్రాజెక్టు పూర్తిగా నిండి పొంగిపొర్లుతోంది. మంగళవారం ఉదయం 6 గంటలకు 2,505 క్యూసెక్కుల ఇన్ ఫ్లో రాగా, కాలువ ద్వారా 100 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మిగిలిన నీరు డ్యామ్ పై నుంచి పొంగి మంజీరా నదిలో కలుస్తోంది. దిగువ ప్రాంత ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## తెలంగాణ పర్యాటక రంగ అభివృద్ధికి కృషి చేయాలి

### రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సంజయ్ జాజు

**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 25 (ప్రజా జ్యోతి)**

రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో - మిగతా4లో



## భూ సేకరణలో పరిహారం చెల్లింపు ప్రక్రియ సమర్థవంతంగా చేపట్టాలి

### రాష్ట్ర నీటిపారుదల, ఆహార-పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి






**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 25 (ప్రజా జ్యోతి)**

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో భాగంగా చేపడుతున్న భూ సేకరణకు సంబంధించి పరిహారం చెల్లింపు ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర నీటిపారుదల, ఆహార--పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుండి నీటిపారుదల శాఖ కార్యదర్శి ఈ. శ్రీధర్‌తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భూ సేకరణ, పునరావాసం--పునరావాస పునరుద్ధరణ (ఆర్ ః ఆర్), అటవీ అనుమతులు తదితర అంశాలపై ఈ సందర్భంగా సమీక్షించారు. మంత్రి మాట్లాడుతూ, భూ సేకరణ పరిహారం చెల్లింపులకు సంబంధించి అమలులో ఉన్న నిబంధనలు, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హతలను పరిశీలించి జిల్లాల వారీగా అర్హుల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. అర్హత కలిగిన భూ నిర్వాసితులు, భూ యజమానులకు నిబంధనల ప్రకారం పరిహారం చెల్లింపుల ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. ఇంజనీరింగ్, రెవెన్యూ, నీటిపారుదల తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం భూ సేకరణ పరిహారం చెల్లింపుల కోసం సుమారు రూ.6 వేల కోట్ల నిధులను విడుదల చేయనున్నందున, అర్హత కలిగిన కేసులను గుర్తించి అవసరమైన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. భూ సేకరణ పరిహారం చెల్లింపులకు సంబంధించి ప్రతి కేసుకు టోకెన్ నంబర్ జనరేట్ చేసి, చెల్లింపుల ప్రక్రియను పారదర్శకంగా, క్రమబద్ధంగా నిర్వహించాలని మంత్రి తెలిపారు. అర్హత నిర్ధారణ, పరిహారం - మిగతా4లో

# బాన్సువాడ నియోజకవర్గంలో
# వివిధ శాఖల్లో వన మహోత్సవం









**కోటగిరి, బాన్స్వాడ, ఆగస్టు 25 ,ప్రజా జ్యోతి.** బాన్సువాడ నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా హాజరై మొక్కలను నాటిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీ పోచారం శ్రీనివాసరెడ్డి , రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మన్ శ్రీ కాసుల బాలరాజు,

బాన్సువాడ నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా హాజరై మొక్కలను నాటిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీ పోచారం శ్రీనివాసరెడ్డి , రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మన్ శ్రీ కాసుల బాలరాజు.

బాన్సువాడ పట్టణంలోని జూనియర్ కళాశాలలో బాన్సువాడ పురపాలక సంఘం ఒ రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో మరియు బాన్సువాడ ఫిల్టర్ బెడ్ ప్రాంతంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మరియు బోర్లం క్యాంప్‌లోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో అటవీ శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. మంగళవారం బాన్సువాడ నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా హాజరై మొక్కలను నాటిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీ పోచారం శ్రీనివాసరెడ్డి , రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మన్ శ్రీ కాసుల బాలరాజు, బాన్సువాడ పట్టణంలోని జూనియర్ కళాశాలలో బాన్సువాడ పురపాలక సంఘం ఒ రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో మరియు బాన్సువాడ ఫిల్టర్ బెడ్ ప్రాంతంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మరియు బోర్లం క్యాంప్‌లోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో అటవీ శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం మోస్రా మండలం గోవూరు గ్రామంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని మొక్కలను నాటారు.

ఈ సందర్భంగా పోచారం గారు మాట్లాడుతూ.

**మొక్కలు నాటుదాం... పర్యావరణాన్ని కాపాడుదాం**

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని తెలిపారు.

పచ్చదనం పెంపొందించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బాన్సువాడ ఆర్డిఓ శ్రీధర్ రెడ్డి , బాన్సువాడ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి కాసుల విజయ , బాన్సువాడ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అనంతరం మోస్రా మండలం గోవూరు గ్రామంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని మొక్కలను నాటారు.

ఈ సందర్భంగా పోచారం గారు మాట్లాడుతూ...

మొక్కలు నాటుదాం. పర్యావరణాన్ని కాపాడుదాం

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని తెలిపారు.

పచ్చదనం పెంపొందించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ ఆర్డీవో శ్రీ రవీందర్ రెడ్డి, గారు, బాన్సువాడ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి కాసుల విజయ గారు, బాన్సువాడ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

బాన్సువాడ పట్టణంలోని జూనియర్ కళాశాలలో బాన్సువాడ పురపాలక సంఘం ఒ రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో మరియు బాన్సువాడ ఫిల్టర్ బెడ్ ప్రాంతంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మరియు బోర్లం క్యాంప్‌లోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో అటవీ శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు.

అనంతరం మోస్రా మండలం గోవూరు గ్రామంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని మొక్కలను నాటారు.

ఈ సందర్భంగా పోచారం గారు మాట్లాడుతూ.

?? మొక్కలు నాటుదాం. పర్యావరణాన్ని కాపాడుదాం

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని తెలిపారు.

పచ్చదనం పెంపొందించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బాన్సువాడ ఆర్డీవో రవీందర్ రెడ్డి గారు, బాన్సువాడ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి కాసుల విజయ , బాన్సువాడ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## సిపిఎం పార్టీ సీనియర్ నేత సారంపల్లి మల్లారెడ్డి ఘన నివాళులు



**నవీపేట్ : (ప్రజా జ్యోతి)** మండల కేంద్రంలోని సుందరయ్య కాలనీలోసిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఘన నివాళులు అర్పించడం జరిగింది. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి నాయక్ వాడి శ్రీనివాస్ మాట్లాడుతూ సారంపల్లి మల్లారెడ్డి గారు సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా రైతు సంఘం అఖిలభారత ఉపాధ్యక్షులుగా పని చేశారని గుర్తు చేశారు ఆయన నిబద్ధత తన సొంత గ్రామమైన ఉమ్మడి వరంగల్ జిల్లాలో తిమ్మంపేట గ్రామంలో తాను పోలీస్ పటేల్ గా పని చేస్తూ సిపిఎం పార్టీకి అండగా నిలిచినందుకు ఆనాడు కాంగ్రెస్ గుండాలు కమ్యూనిస్టులపై దాడులు చేసినప్పుడు తన పోలీసు పటేల్ హోదాలో సిపిఎం పార్టీ సభ్యుల వైపు పేదల వైపు నిలబడ్డారు దానికి ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం పోలీస్ పటేల్ ఉద్యోగానికి సస్పెండ్ చేసింది తర్వాత సిపిఎం పార్టీ పూర్తి కాలం కార్యకర్తగా పనిచేస్తూ ఆ గ్రామ సర్పంచ్ గా విధులు నిర్వహిస్తూ 116 మందికి భూములను పంచడం జరిగిందని అట్టి గ్రామాన్ని ఆ రోజుల్లోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడంలో ఆయన కృషి ఎనలేనిది అని అన్నారు.ఎమ్మెల్యే ఎమ్మెల్సీలకు సారంపల్లి మల్లారెడ్డి చట్టసభల్లో ఏవిధంగా మాట్లాడాలో క్లాసులు చెప్పేవారని పేద ప్రజల పక్కనా నిలబడడానికి ఎలా వివరించాలో చూపించిన దారి ఈరోజు ఆయన లేకపోవడం సిపిఎం పార్టీకి తీరని లోటు అయినప్పటికీ ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లినాడే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల నాయకులు షేక్ మహబూబ్,వసంత్ పార్టీ నాయకులు సావిత్రి, షమీం గౌతమ్ ,సుశీల తదితరులు పాల్గొన్నారు .

## ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి నూతన కమిటీల నియామకం.



**నవీపేట్: (ప్రజా జ్యోతి):** మండలంలోని కమలాపూర్, నిజాంపూర్ స్టేషన్ ఏరియా గ్రామాల్లో మంగళవారం ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మండల శాఖ ఇన్చార్జ్ ఆకారం రమేష్ మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గ్రామస్థాయి నుండి మండల స్థాయి వరకు నూతన కమిటీల నియామకం చేపట్టి అసమానతలు లేని సమాజ నిర్మాణానికి ఎమ్మార్పీఎస్ నిరంతరంగా పోరాడుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కోపర్గా కిషన్, రాకేష్ గంగాధర్, బిసి నాయకులు శ్రీనివాస్ ,గుర్రాల భూమేష్, వేల్పుల సుధాకర్, మట్టమల్ల విజయ్ కుమార్, పోశెట్టి ,సిలుముల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## జలసిరి ఇంకుడు గుంతల నిర్మాణాలు





**బాల్కొండ,(ప్రజా జ్యోతి) ఆగస్టు 25** బాల్కొండ మండలంలోని జలాల్పూర్ గ్రామంలో జలసిరి పథకం కింద ఇంకుడు గుంతల నిర్మాణానికి మంగళవారం భూమి పూజ చేశారు.భూగర్భ జల వనరులను,వర్షపు నీటిని పొదుపు చేసే విధంగా, వ్యవసాయ రంగానికి నీటి సౌకర్యం సమృద్ధి కొరకు వీటిని నిర్మాణం చేపడుతున్నట్లు సర్పంచ్ గుండేడి మోహన్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ భాస్కర్ రెడ్డి, సూపరిండెంట్ రమణ, ఉప సర్పంచ్ భోజన్న, కార్యదర్శి దేవేందర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ముందస్తు అరెస్టు



**ధర్పల్లి (ప్రజా జ్యోతి) ఆగస్టు 25** రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల జిల్లా పర్యటన నేపథ్యంలో పోలీస్ శాఖ తగిన బందోబస్తు ఏర్పాట్లు చేసింది శాంతి భద్రతల పర్యవేక్షణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పలువురుని అదుపులోకి తీసుకుంది ఇందులో భాగంగా ధర్పల్లి పోలీసులు సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ భీంగల్ ఏరియా కార్యదర్శి వి బాలయ్యను ముందస్తుగ అరెస్టు చేశారు ఆయన పార్టీ వ్యవహారాలతో పాటు తెలంగాణ రాష్ట్ర సహారా బాధితుల సంక్షేమ సంఘం అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతు పోలీసుల ముందస్తు అరెస్టు చెర్యల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు వారి సాధక బాధలను గవర్నర్ దృష్టికి తీసుకు వెళ్లలేకపోయామని అన్నారు ప్రభుత్వ చర్య అప్రజాసామికం అంటు ఖండించారు

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం





**బాల్కొండ,(ప్రజ జ్యోతి) ఆగస్టు 25** బాల్కొండ మండల కేంద్రంలోని బస్సాపూర్ గ్రామంలో నూతన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీ.పొలంపల్లి శ్రీనివాస్ మరియు గ్రామ పంచాయతీ పాలకవర్గం మరియు గ్రామ ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## తెలంగాణ యూనివసిటీ లో ఘనంగా తీజ్ పండుగ వేడుకలు





**ఇందల్వాయి.ఆగస్టు 25:** డిచ్పల్లి మండలంలోని యూనివసిటీ లో బంజారా సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే తీజ్ పండుగను భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. బంజారా సమాజంలో పెళ్లి కాని యువతులు అత్యంత పవిత్రంగా జరుపుకునే ఈ పండుగ సందర్భంగా యువతులు తొమ్మిది రోజుల పాటు నియమనిష్ఠలతో అమ్మవారిని ఆరాధిస్తూ ప్రత్యేక వ్రతాలు ఆచరించారు. గ్రామ పెద్దలు తెలిపిన వివరాల ప్రకారం, పురాణాల ప్రకారం జగదాంబ దేవి పరమశివుడిని ప్రసన్నం చేసుకోవడానికి తీజ్ వ్రతాన్ని ఆచరించిందని, అదే సంప్రదాయాన్ని అనుసరిస్తూ బంజారా యువతులు మంచి భర్త లభించాలని కోరుకుంటూ ఈ వ్రతాన్ని నిర్వహిస్తారని తెలిపారు. తరతరాలుగా తాతముత్తాతల నుంచి వస్తున్న ఈ ఆచారాన్ని బంజారా సమాజం ఇప్పటికీ అత్యంత భక్తి, విశ్వాసాలతో కొనసాగిస్తోందని పేర్కొన్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా రమేశ్ మారజ్ హాజరై జగదాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీజ్ వ్రతం చేస్తున్న యువతులను ఆశీర్వదించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని,యూనివర్సిటీ కు ఏ అవసరం వచ్చినా తనను సంప్రదించాలని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాము , పవన్ కల్యాణ్, రాజు,పృథ్వీప్, దినేష్,శేఖర,మహేష్,రాకేష్

## గుమ్మిర్యాల్ గ్రామపంచాయతీకి బాడీ ఫ్రీజర్ బాక్స్ విరాళం





**ప్రజాజ్యోతి, ఏర్గట్ల:** రెడ్డి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రామంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మృతదేహాలను భద్రపరిచేందుకు ఉపయోగించే బాడీ ఫ్రీజర్ బాక్స్‌ను గ్రామపంచాయతీకి విరాళంగా అందజేశారు. అనంతరం గ్రామస్తులకు సింగిల్-యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని అసోసియేషన్ సభ్యులు సూచించారు. సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలతో పాటు ప్లాస్టిక్ నిర్మూలన వంటి పర్యావరణహిత కార్యక్రమాల్లో ప్రజలు చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేశ బోయిన జమున సంజీవ్, ఉప సర్పంచ్ జై డి కిషోర్, సెక్రటరీ రామకృష్ణ, కారోబార్ స్థానిక నాయకులు కిషోర్, రామకృష్ణ, గంగాధర్, మురళి, రెడ్డి యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. గ్రామ అవసరాల కోసం బాడీ ఫ్రీజర్ బాక్స్‌ను అందించిన రెడ్డి యూత్ అసోసియేషన్‌ను గ్రామస్తులు అభినందించారు. భవిష్యత్తులోనూ సామాజిక సేవా, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను కొనసాగించాలని ఆకాంక్షించారు.

## తీర్మానించిన అభివృద్ధి పనులను త్వరగా ప్రారంభించాలి





**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి) ఆగస్టు. 25** ఇందల్వాయి మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలో 15 ఫైనాన్స్, 16 ఫైనాన్స్ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై గ్రామపంచాయతీ బాడీ సమావేశం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చింతల కిషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో గ్రామ అభివృద్ధి, మౌలిక వసతులపై సభ్యులు చర్చించారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, వాటర్ ట్యాంక్ తదితర పనులకు ఇప్పటికే తీర్మానాలు చేసినందున వాటిని త్వరితగతిన ప్రారంభించాలని సమావేశంలో నిర్ణయించారు. అలాగే గ్రామంలోని వివిధ వార్డుల్లో నెలకొన్న సమస్యలను సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ చింతల కిషన్ మాట్లాడుతూ.. గ్రామంలో ఎక్కడా సమస్యలు లేకుండా చూడడమే తమ బాధ్యత అన్నారు. ప్రతి వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించడమే తమ లక్ష్యమని తెలిపారు. అభివృద్ధి పనులను వేగవంతం చేసి గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు, ఉపసర్పంచ్, పంచాయతీ సెక్రటరీ కారోబార్ గ్రామపంచాయతీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఏర్గట్ల మహిళా సమాఖ్య మహాజనసభ





**..ప్రభుత్వ పథకాలపై అవగాహన**

**ప్రజా జ్యోతి, ఏర్గట్ల:** ఏర్గట్ల మండల మహిళా సమాఖ్య వార్షిక మహాజనసభను మంగళవారం స్థానిక రైతు వేదికలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వ పథకాలు, రుణాలు, విద్యా అవకాశాలు, ఉపాధి కల్పన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం కుంట గంగాధర్ సూచించారు. మహిళా సంఘాల ద్వారా పొందిన రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ఓపెన్ స్కూల్ విధానంలో మహిళా సంఘాల సభ్యులు పదో తరగతి, ఒకేసారి పరీక్ష విధానంలో ఇంటర్మీడియట్ పరీక్షలు రాసే అవకాశం ఉందని తెలిపారు. ఈ నెలాఖరులోగా ఫీజు చెల్లించి పరీక్షలకు హాజరు కావచ్చని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మహిళా సంఘాలకు అందించే పాఠశాల యూనిఫారాలు నాణ్యతతో తయారయ్యేలా చూడాలని, సంఘాలు తీసుకున్న రుణాలను వంద శాతం తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. గ్రామ సమాఖ్యల్లో నూతనంగా ఎన్నికైన ప్రతినిధులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి గ్రామ సమాఖ్య పరిధిలో కనీసం ఇద్దరు రైతులతో ఫారం పాండ్లు నిర్మించేలా ప్రోత్సహించాలని ఏపీవో విద్యానంద్ తెలిపారు. ఫారం పాండ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.2 లక్షలకు పైగా ఆర్థిక సహాయాన్ని పూర్తిగా ఉచితంగా అందజేస్తోందని వివరించారు.

**బ్యాంకు అనుసంధానంలో ఏర్గట్ల సమాఖ్యకు అగ్రస్థానం**

బ్యాంకు అనుసంధానం, స్త్రీనిధి రుణాల విషయంలో ఏర్గట్ల మహిళా సమాఖ్య జిల్లాలోనే అగ్రస్థానంలో ఉందని ఎన్నికల అధికారిగా హాజరైన కమ్మర్‌పల్లి ఐకేపీ ఏపీఎం కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ విజయానికి ఏపీఎం కుంట గంగాధర్‌తో పాటు సీసీ రవికుమార్, 13 మంది వీవోఏల కృషి ఎంతో ఉందని అభినందించారు.

**సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన అష్ట గంగాధర్**

ఐకేపీ జిల్లా సాంస్కృతిక సమన్వయకర్త అష్ట గంగాధర్ ముఖ్య అతిథిగా హాజరై గాన ప్రదర్శనతో మహిళలను అలరించారు. పసుపు ప్రాధాన్యతను వివరించే పాటతో పాటు మహిళా సంఘాల కార్యకలాపాలపై ఆటపాటలు నిర్వహించారు. ఆయన గేయాలాపనతో సమావేశానికి హాజరైన మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

**ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం ఎన్నిక**

మండల మహిళా సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కుందెనే లక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా దోమచందా లావణ్య, ప్రధాన కార్యదర్శిగా ఏర్గట్ల లావణ్య, సహాయ కార్యదర్శిగా గోదావరి, కోశాధికారిగా గంగజమున, కార్యవర్గ ప్రతినిధిగా దేవాయిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు భలేరావు రవికుమార్, నవీన్, పీరియా, స్త్రీనిధి సహాయ నిర్వాహకురాలు సరస్వతి, మండల సమాఖ్య సిబ్బంది సుప్రియ, జాహిద్, గ్రామ సమాఖ్యల అధ్యక్షురాళ్లు, వీవోఏలు, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు. మండల మహిళా సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కుందెనే లక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా దోచంద లావణ్య, ప్రధాన కార్యదర్శిగా ఏర్గట్ల లావణ్య, సహాయ కార్యదర్శిగా గోదావరి, కోశాధికారిగా గంగజమున, కార్యవర్గ ప్రతినిధిగా దేవాయిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీసీలు భలేరావు రవికుమార్, నవీన్, పీరియా, స్త్రీనిధి సహాయ నిర్వాహకురాలు సరస్వతి, మండల సమాఖ్య సిబ్బంది సుప్రియ, జాహిద్, గ్రామ సమాఖ్యల అధ్యక్షురాళ్లు, వీవోఏలు, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

## కోటగిరి మండల కేంద్రంలో గల మరిగమ్మ ఆలయ వార్షికోత్సవ ఘనంగా నిర్వహించారు.



**కోటగిరి ,ఆగస్టు 25, ప్రజా జ్యోతి :** కోటగిరి మండల కేంద్రంలో గల మరియమ్మ ఆలయంలో వార్షికోత్సవం ఘనంగా మంగళవారం నిర్వహించారు. . మరి అమ్మ గుడి ఆలయంలో సర్పగుడిలో మండల మండలంలో టిఆర్ఎస్ నాయకులు కేల రవికుమార్, టిఆర్ఎస్ నాయకుల ందరూ కలిసికట్టుకో వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు కోటగిరి మండల కేంద్రానికి చెందిన స్థానిక సర్పంచ్ ఆలయాన్ని సందర్శించి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు మరియు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ పండుగను కోటగిరి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు అన్నదాన కార్యక్రమం కూడా ఏర్పాటు చేశారు వచ్చిన భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం పాలుపంచుకొని అమ్మవారి కృపా కటాక్షాలు ఉండాలని దీవాన్న కోరుకుంటూ ఆశీర్వాదం తీసుకున్నారు. అమ్మ తల్లి అమ్మ మా పంటలను రక్షించాలి మమ్మల్ని కూడా రక్షించాలి వేదాల నుంచి రక్షించాలి అని వేడుకుంటూ ప్రార్థన చేసి మొక్కలను తీర్చుకొని ఘనంగా పండగ నిర్వహించామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు ఈ కార్యక్రమంలో మరిగమ్మ గుడి ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ ఎంపీఎస్ బోధన్ మండలం నూతన కమిటీల నియామకం



**ప్రజా జ్యోతి బోధన్ ఆగస్టు 23..** ఎమ్మార్పీఎస్ అధినేత, గౌరవ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారి ఆదేశాల మేరకు బోధన్ మండలంలిలో ఎమ్మార్పీఎస్ ఎంపీఎస్ నూతన కమిటీల నిర్మాణం చేపట్టడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ నిజామాబాద్ జిల్లా ఇన్చార్జి మాసాయిపేట యాదగిరి మాదిగా గారు పాల్గొన్నారు. బోధన్ మండల కమిటీ సమావేశంకు కోపిరాల రామ్ చందర్ మాదిగ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మార్పీ జిల్లా ఇన్చార్జి మాసాయిపేట యాదగిరి మాట్లాడుతూ... ఎమ్మార్పీఎస్ అధినేత గౌరవ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారి ఆదేశాల మేరకు గ్రామ,మండల ,జిల్లా స్థాయిలో కమిటీల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాడాల్సిన అవసరం ఉందని, అందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. బోధన్ మండల ఎమ్మార్పీఎస్ ఎం పి ఎస్ బోధన్ మండల కమిటీలను ఎన్నుకోవడం జరుగుతుందనీ అన్నారు.. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుమ్మటు పద్మ, జాతీయ కోర్ కమిటీ సభ్యురాలు యమునా మాదిగ , ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్చార్జి లసింగరి భూమయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ సీనియర్ నాయకులు గంధమల చంద్రయ్య మాదిగ, పులి ప్రవీణ్ , మధు,భాను ప్రకాష్ ,బండారి గంగాధర్, విజయ్ ,తదితరులు పాల్గొన్నారు.

## గుమ్మిర్యాల్‌లో కమ్యూనిటీ సోక్‌పిట్ పనులు ప్రారంభం



**ప్రజాజ్యోతి, ఏర్గట్ల:** మండలంలోని గుమ్మిర్యాల్ గ్రామంలో కమ్యూనిటీ సోక్‌పిట్‌ల నిర్మాణ పనులను ఎంపీడీవో వెంకటేశ్వర్లు పరిశీలించి, ఫార్మ్ పాండ్‌కు ముగ్గు వేసి పనులను ప్రారంభించారు. గ్రామంలో పారిశుద్ధ్యం, నీటి సంరక్షణకు ఉపయోగపడే విధంగా చేపడుతున్న ఈ పనులను అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేశ బోయిన జమున సంజీవ్, ఉప సర్పంచ్ కిషోర్, ఏపీవో, సాంకేతిక సహాయకుడు (టీఏ), పంచాయతీ కార్యదర్శి, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు. గ్రామంలో అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులు సూచించారు.

## ముప్కాల్‌లో ఎంపీ ధర్మపురి అరవింద్ జన్మదిన వేడుకలు



**ముప్కాల్, ప్రజాజోతి, ఆగస్టు 25** ముప్కాల్ మండల కేంద్రంలో మంగళవారం నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ జన్మదిన వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఎంపీ ధర్మపురి అరవింద్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం మండలంలోని ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న కార్మికులకు పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గడ్డం సంతోష్, జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల శ్రీనివాస్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ముస్కు నర్సయ్య, ముస్కు భూమేశ్వర్, గంగ సాయన్న,సాగర్, నర్సయ్య, లోక రాములు తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి వారి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



**ఇందల్వాయి( ప్రజా జ్యోతి ), ఆగస్టు 25:** ఇందల్వాయి మండలంలోని జీకే తండా గ్రామపంచాయతీ పరిధిలో కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన ఆరు ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి ఆదేశానుసారం జీకే తండాకు ఆరు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, గ్రామ నాయకురాలు శిరీష మహిపాల్ ఆధ్వర్యంలో ఆయా ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా శిరీష మహిపాల్ మాట్లాడుతూ.. పేదింటి వారి సొంతింటి కలను నెరవేర్చుతున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు. పేదలు, వృద్ధులు, బీడీలు చుట్టే మహిళలు, వికలాంగులకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. పేద ప్రజలకు చేయూత అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రజిత సుధర్, వార్డు మెంబర్లు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఫలవంతమైన తెలుగు పాఠశాల సముదాయ సమావేశం



**బాల్కొండ,(ప్రజా జ్యోతి) ఆగస్టు 25** బాల్కొండ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,బాల్కొండలో నిర్వహించిన తెలుగు పాఠశాల సముదాయ సమావేశం ఫలవంతంగా ముగిసింది.కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బట్టు రాజేశ్వర్ గారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర స్థాయి తెలుగు విషయ నిపుణులు,పద్యకోకిల, అష్టావధాని డాక్టర్ బోచ్కర్ ఓంప్రకాశ్, పాఠశాల సముదాయ కార్యదర్శి శ్రీలక్ష్మి, ఆర్పీ నాగుల రాజేందర్ పాటు 40 మందికి పైగా ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ సమావేశంలో తెలుగు విషయ బోధనకు సంబంధించిన పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు, సృజనాత్మకత, పఠనాసక్తి పెంపొందించేందుకు అనుసరించాల్సిన ఆధునిక బోధనా పద్ధతులపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బట్టు రాజేశ్వర్ మాట్లాడుతూ, ఉపాధ్యాయులు కాలానుగుణంగా మారుతున్న బోధనా పద్ధతులను అవగాహన చేసుకుని,వాటిని తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. విద్యార్థుల్లో అవసరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రతి ఉపాధ్యాయుడు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు.అలాగే (పనితీరు శ్రేణి సూచిక) గురించి ప్రధానోపాధ్యాయులు బట్టు రాజేశ్వర్ వివరించారు.విద్యా రంగంలో పాఠశాలలు, జిల్లాలు సాధిస్తున్న పురోగతిని వివిధ సూచికల ఆధారంగా అంచనా వేయడంలో ప్రాముఖ్యతను వివరించారు.విద్యా ప్రమాణాల మెరుగుదలకు ఉపాధ్యాయులు, పాఠశాలలు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు.ఈ కార్యక్రమం నిర్ణీత సరళి ప్రకారం కొనసాగగా, రాష్ట్ర స్థాయి విషయ నిపుణులు డాక్టర్ బోచ్కర్ ఓంప్రకాశ్, శ్రీలక్ష్మి, నాగుల రాజేందర్ గౌడ్లు తెలుగు బోధనకు సంబంధించిన వివిధ అంశాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులకు నూతన బోధనా పద్ధతులు,విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి,ూ+× సూచికలు తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించిన ఈ పాఠశాల సముదాయ సమావేశం విజయవంతంగా ముగిసింది.

## బీజేపీ కార్యకర్తకు ఎంపీ ధర్మపురి అరవింద్ ఆర్థిక సాయం



**ఇందల్వాయి:** ఇందల్వాయి మండల కేంద్రంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త మఠముల వినయ్ ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ తన సొంత నిధులతో పీడీఎఫ్ ఫౌండేషన్ ద్వారా రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ ఆర్థిక సహాయాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షులు కులాచారి దినేష్ కుమార్ వినయ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలను సొంత అన్నదమ్ములుగా భావిస్తూ, వారి కష్టాల్లో అండగా నిలుస్తున్న ఎంపీ ధర్మపురి అరవింద్‌కు ఎల్లారెడ్డిపల్లి గ్రామస్తులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కార్యకర్తలు ఎవరూ ఇబ్బందుల్లో ఉన్నా తన వంతు సహాయం అందించేందుకు ఎంపీ అరవింద్ ఎల్లప్పుడూజస్త్ర ముందుంటారని వారు పేర్కొన్నారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న మఠముల వినయ్ త్వరగా కోలుకోవాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రాజన్న మండల అధ్యక్షులు జి శ్రీనివాస్ బిజెపి నాయకులు పాల్గొన్నారు

# గ్రంథాలయానికి ఇంటర్మీడియట్ పుస్తకాల అందజేత

**ఎల్లారెడ్డి, ఆగస్టు 25(ప్రజా జ్యోతి )** ఎల్లారెడ్డి శాఖ గ్రంథాలయానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల తరపున ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పుస్తకాలను బుధవారం కళాశాల సతీష్ అందజేశారు. పాఠకుల కోరిక మేరకు టర్మీడియట్ పుస్తకాలను శాఖ గ్రంథాలయం ఎల్లారెడ్డి గ్రంథపాలకులు జాకీర్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సతీష్ గారు మాట్లాడుతూ, విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న పాఠకులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను ఎప్పటికప్పుడు అందజేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ సతీష్, కళాశాల లైబ్రేరియన్, శాఖ గ్రంథాలయ గ్రంథపాలకులు జాకీర్ తదితరులు పాల్గొన్నారు.



# వన మహోత్సవం టేకు మొక్కల పంపిణీ

**-- ఏఈఓ రాకేష్ మినుకుల**

**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 25 (ప్రజా జ్యోతి)** గొల్లపల్లి గ్రామంలో ఘనంగా వన మహోత్సవం 500 టేకు మొక్కల పంపిణీ కార్యక్రమం మంగళవారం గొల్లపల్లి గ్రామంలో ఏఈఓ రాకేష్ ఆధ్వర్యంలో వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో భాగంగా గ్రామం లోని రైతులకు 500 టేకు మొక్కలను పంపిణీ చేసి, వారి పొలాల గట్ల పై స్వయంగా నాటించడం జరిగింది. ప్రతి ఒక్కరూ తమ విధిగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించి పర్యావరణాన్ని కాపాడుకోవాలని సూచించడం జరిగింది. పొలాల గట్లపై టేకు వంటి దీర్ఘకాలిక వాణిజ్య మొక్కలను పెంచడం ద్వారా పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా ఉండటమే కాకుండా, భవిష్యత్తులో రైతులకు అదనపు ఆర్థిక భరోసా లభిస్తుందని వివరించడం జరిగింది. అంతే కాకుండా, చెట్లు వర్షాలను ఆకర్షించడంతో పాటు భూగర్భ జల మట్టాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్ సెక్రెటరీ పాపి రెడ్డి, జిపిఓ శ్రీకాంత్ రైతులు, తదితరులు పాల్గొని మొక్కలు నాటడంలో భాగస్వామ్యులయ్యారు.






# 'హరిత గ్రామాలే లక్ష్యంగా వన మహోత్సవం'

**డోంగ్లి ఆగస్టు 24 (ప్రజాజ్యోతి)** పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలంటే విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాల ని లింబూర్ గ్రామ సుజాత శివ రెడ్డి అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా డోంగ్లి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఆయా గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో మంగళవారం పెద్దఎత్తున మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సుజాత శివ రెడ్డి మాట్లాడుతూ.. మొక్కలు నాటడం కార్యక్రమాన్ని ఒకరోజుకే పరిమితం చేయకుండా వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. గ్రామాల్లో పచ్చదనం పెంపొందించడం ద్వారా ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చున్నారు. ప్రతి గ్రామాన్ని హరిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. మొక్కను నాటడం కంటే దాన్ని సంరక్షించడమే ముఖ్యమని, నాటిన ప్రతి మొక్కను బాధ్యతగా పెంచితేనే వనమహోత్సవం కార్యక్రమం లక్ష్యం నెరవేరుతుందన్నారు. భవిష్యత్ తరాల కోసం ప్రతి కుటుంబం కనీసం కొన్ని మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని కోరారు. మొక్క నాటుదా పర్యావరణాన్ని కాపాడుదాం.. మన గ్రామాలను పచ్చదన నింపుదాం. హరిత గ్రామాల నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి శశిధర్, ఉప సర్పంచ్ సంతోష్,జి పి ఓ రవీందర్, ఫీల్డ్ అసిస్టెంట్ గౌలే ధమపాల్, ఉపాధ్యాయులు,వార్డ్ సభ్యులు,గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు,



# మొక్కలు నాటి స్మార్ట్ కార్డుల పంపిణీ

**-- సర్పంచ్ డోకి లచ్చయ్య**

**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 25 (ప్రజా జ్యోతి)** రామారెడ్డి మండల కేంద్రంలోని ఈసన్నపల్లి గ్రామంలో మంగళవారం గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామంలో మొక్కలు నాటడం జరిగింది. ఈ సందర్భంగా పర్యావరణానికి ఉపయోగపడే మొక్కలను ప్రతి ఒక్కరూ నాటాలని ప్రజలను ఉద్దేశించి తెలిపారు. అదేవిధంగా గ్రామంలో లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డ్ లను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డోకి లచ్చయ్య, ఉప సర్పంచ్ తుమ్మల రమేష్, సెక్రటరీ సత్యవతి, వార్డ్ మెంబర్లు నవీన్, శ్రీకాంత్, వారి పాలకవర్గం, జిపిఓ స్వామి, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



# భూ సేకరణలో పరిహారం చెల్లింపు ప్రక్రియ సమర్థవంతంగా చేపట్టాలి

-మొదటిపేజీ తరువాయి

చెల్లింపులు లేదా ఇతర సాంకేతిక, పరిపాలనా సమస్యలు ఎదురైనప్పుడు సంబంధిత అధికారులు ప్రధాన కార్యాలయాన్ని సంప్రదించి సమస్యలను వెంటనే పరిష్కరించుకోవాలని సూచించారు. నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో అవసరమైన చర్యలు చేపట్టాలని, పి.డి. ఖాతాల్లో అందుబాటులో ఉన్న నిధులను నిబంధనల ప్రకారం వెంటనే భూ యజమానులకు చెల్లించాలని ఆదేశించారు. భూ సేకరణ, ఆర్ ఄ ఆర్, అటవీ భూములకు సంబంధించిన పెండింగ్ అంశాలను నిర్దేశిత కాలవ్యవధిలో పరిష్కరించి అభివృద్ధి ప్రాజెక్టుల పనులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా జిల్లాల వారీగా భూ సేకరణ పురోగతి, పరిహారం చెల్లింపులు, ఆర్.ఆర్ చర్యలు, అటవీ భూములకు సంబంధించిన అనుమతులు, పెండింగ్ సమస్యలపై సమీక్ష నిర్వహించారు. కామారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రవితేజ, భూ సేకరణ, నీటిపారుదల శాఖల అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పచ్చదనం కోసం మన అడుగు.



-మొదటిపేజీ తరువాయి

తీసుకోవాలని ఎస్పీ సూచించారు. "మొక్క నాటడం మాత్రమే కాదు.. దానిని సంరక్షించడం కూడా మన బాధ్యత" అని ఆయన పేర్కొన్నారు.

ఒక మొక్కను నాటి వదిలేయకుండా అది పెరిగే వరకు క్రమం తప్పకుండా నీరు పోయడం, అవసరమైన రక్షణ కల్పించడం, పశువులు మరియు ఇతర కారణాల వల్ల నష్టం జరగకుండా సంరక్షించడం అవసరమని అన్నారు. ప్రతి కుటుంబం, ప్రతి సంస్థ, ప్రతి గ్రామం తమ పరిధిలో మొక్కల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు.

**యువత, విద్యార్థులు భాగస్వాములు కావాలి**

వనమహోత్సవాన్ని కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా ప్రజా ఉద్యమంగా మార్చాల్సిన అవసరం ఉందని ఎస్పీ అన్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో ముందుండాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ శాఖ పరిధిలోని ప్రాంగణాల్లో విస్తృతంగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజలు తమ ఇళ్ల పరిసరాల్లో, ఖాళీ ప్రదేశాల్లో, రహదారుల వెంట, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాల్లో మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కనీసం కొన్ని మొక్కలను నాటి వాటి సంరక్షణకు కట్టుబడి ఉంటే కామారెడ్డి జిల్లాను మరింత పచ్చగా తీర్చిదిద్దవచ్చని ఎస్పీ తెలిపారు.

**పర్యావరణ సమతుల్యతకు మొక్కలు ఎంతో అవసరం**

మొక్కలు గాలి నాణ్యతను మెరుగుపరచడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని ఎస్పీ పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణం అందించాలంటే ప్రస్తుత తరమే పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. వనమహోత్సవ కార్యక్రమంలో పోలీస్ శాఖ తరపున కూడా విస్తృతంగా మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపుతామని తెలిపారు. పోలీస్ అధికారులు, సిబ్బంది కూడా తమ పరిసరాల్లో పచ్చదనం పెంచేందుకు ముందుకు రావాలని సూచించారు.

**పచ్చని కామారెడ్డి నిర్మాణమే లక్ష్యం**

ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే పచ్చని కామారెడ్డిని నిర్మించగలమని జిల్లా ఎస్పీ తెలిపారు. మొక్కలు నాటడం ఒకరి బాధ్యత కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందన్నారు. నాటిన మొక్కలను సంరక్షించడాన్ని నిరంతర కార్యక్రమంగా కొనసాగించాలని సూచించారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడటంతో పాటు ప్రజల ఆరోగ్యానికి కూడా మేలు జరుగుతుందని అన్నారు. వనమహోత్సవ స్ఫూర్తితో జిల్లావ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున మొక్కలు నాటి, వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ అడ్మిన్ కే. నర్సింహారెడ్డి, ఏఆర్ డీఎస్పీ ఉదయభాస్కర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, ఆర్ఐలు సంతోష్ కుమార్, నవీన్, కృష్ణ, ఆర్ఎస్ఐతో పాటు పోలీస్ శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. "ఈరోజు మనం నాటే ప్రతి మొక్క.. రేపటి తరాలకు అందించే అమూల్యమైన బహుమతి. పచ్చదనం కోసం ప్రతి ఒక్కరూ ముందడుగు వేయాలి.. భవిష్యత్ తరాల కోసం బాధ్యతగా మొక్కలను సంరక్షించాలి" అనే సందేశంతో వనమహోత్సవ కార్యక్రమం కొనసాగింది.

# తెలంగాణ పర్యాటక రంగ అభివృద్ధికి కృషి చేయాలి




-మొదటిపేజీ తరువాయి

వాతావరణ పరిస్థితులు, వర్షపాతం, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీట్ పరీక్ష నిర్వహణ, పర్యాటక రంగ అభివృద్ధి తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి పర్యాటకులకు సులభమైన ప్రయాణాలు, వసతి, స్మార్ట్ పాస్‌లు ఇతర సౌకర్యాలు కల్పించి 27 గుర్తించిన ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని తెలిపారు. కామారెడ్డి జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పర్యాటక రంగ అభివృద్ధి, పంటల వైవిధ్యీకరణపై రైతులకు అవగాహన కల్పిస్తూ ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ ఎన్ వై గిరి ట్రైనింగ్ కలెక్టర్ రవితేజ,ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ, ఎస్సీ, ఎస్టీల ఐక్యతతోనే సామాజిక న్యాయం సాధ్యం





**ప్రజాజ్యోతి, ధర్పల్లి:** సామాజిక న్యాయం, రాజ్యాధికార సాధన కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఐక్యంగా ముందుకు సాగాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చారు. జేఏసీ స్థాపకుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ ఆదేశాల మేరకు నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలోని ముదిరాజ్ పందెనావాడ సంఘంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర నాయకుడు మహిపాల్, నిజామాబాద్ జిల్లా కన్వీనర్ కోటగిరి రామగౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనాదిగా అగ్రకుల ఆధిపత్యం కారణంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలు రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్నాయని అన్నారు. కులాల మధ్య విభజనలు సృష్టించడం వల్ల బడుగు, బలహీన వర్గాలకు తగిన అవకాశాలు దక్కడం లేదని పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలంతా ఐక్యతతో ముందుకు వస్తే ప్రతి కుటుంబంలోని యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు రాజకీయంగా కూడా తగిన ప్రాతినిధ్యం సాధించవచ్చని అన్నారు. తమ హక్కులు, అవకాశాల కోసం ఇకనైనా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు రాజకీయంగా చైతన్యంతో వ్యవహరించాలని,తమ వర్గాల అభివృద్ధి కోసం ఐక్యంగా పనిచేయాలని సూచించారు.

**ధర్పల్లి మండల కమిటీ ఎన్నిక**

సమావేశం అనంతరం ధర్పల్లి మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా కిరణ్ గౌడ్, కో-కన్వీనర్‌గా నారవోయిన రవి, ప్రధాన కార్యదర్శిగా బోండ్ల లక్ష్మీనర్సయ్య, కార్యదర్శులుగా ఇంజాపురం భాస్కర్, నూతుపల్లి సుమతి, కల్పన, నిఖిల్‌లను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా నిమ్మల గంగాధర్ గౌడ్, వనజ, శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్, మండల నాయకులు మహిపాల్, నలిని శ్రీకాంత్, మండల ఉపాధ్యక్షుడు కిషన్‌తో పాటు సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ భీమ్‌గల్ కార్యదర్శి వడ్ల బాలయ్య, మచ్చ నారాయణ, టప్ప రాములు, మచ్చ రఘురామ్, బోండ్ల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయం కోసం పోరాడుదాం

**ధర్పల్లి (ప్రజా జ్యోతి) ఆగస్టు 25** బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసి ఆధ్వర్యంలో కలిసికట్టుగా సామాజిక న్యాయం కోసం పోరాడాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు మండల కేంద్రంలోని ముదిరాజ్ పందెనావాడ సంఘంలో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతు విద్యా ఉద్యోగాలు రాజకీయంగా అగ్రవర్ణాల పెత్తనమే కొనసాగుతుందని వారు దుయ్యబట్టారు వచ్చే ఎన్నికల్లో బడుగు బలహీన వర్గాలు ఐకమత్యంతో ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర నాయకులు మహిపాల్ మాట్లాడుతు జేఏసీ వ్యవస్థాపకులు డాక్టర్ విశారదన్ మహారాజ్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని అన్నారు సమావేశంలో జిల్లా కన్వీనర్ కోటగిరి రామగౌడ్ సీనియర్ నాయకులు చేలిమెల నర్సయ్య సిపిఎం నాయకుడు వడ్ల బాలయ్య మచ్చ నారాయణ రఘురాం బోన్ల నరసయ్య మహిపాల్ నలిని శ్రీకాంత్ కిషన్ తదితరులు పాల్గొన్నారు



**నూతన కార్యవర్గం ఏర్పాటు**

సమావేశం అనంతరం ధర్పల్లి నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు కన్వీనర్ గ కిరణ్ గౌడ్ కో కన్వీనర్ నారవోయిన రవి ప్రధాన కార్యదర్శిగ బోండ్ల లక్ష్మీ నర్సయ్య ఇంజాపురం భాస్కర్ కార్యదర్శిలుగ నూతుపల్లి సుమతి కల్పన నిఖిల్ సభ్యులు నిమ్మల గంగాధర్ గౌడ్ వనజ శ్రీనివాస్ ల ను ఎన్నుకున్నారు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సిపిఎంఎల్ న్యూ డెమోక్రసీ భీమ్గల్ కార్యదర్శి వడ్ల బాలయ్య మచ్చ నారాయణ టప్ప రాములు మచ్చ రఘురామ్ బోండ్ల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డి మోడల్ స్కూల్లో ఘనంగా వన మహోత్సవం

**ఎల్లారెడ్డి, ఆగస్టు 25(ప్రజా జ్యోతి )** ఎల్లారెడ్డి పట్టణంలోని మోడల్ స్కూల్లో సోమవారం వన మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రిన్సిపల్ తోట గాంధీ, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, మున్సిపల్ కౌన్సిలర్లు, విద్యార్థులు కలిసి పాఠశాల ఆవరణలో 500 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు తమ కుటుంబ సభ్యుల పేరిట ఒక మొక్కను నాటి, వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపల్ తోట గాంధీ మాట్లాడుతూ, వన మహోత్సవంలో భాగంగా ప్రతి ఒక్కరు మొక్కలను నాటి దత్తత తీసుకొని కాపాడాలన్నారు. మొక్కలు నాటడం వల్ల పర్యావరణ కాలుష్యం తగ్గుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ ఆల్తమాస్ జహంగీర్, ప్రియదర్శిని, లక్ష్మణ్ సింగ్, బలవంతరావు, కౌన్సిలర్లు తిరుపతి, సిద్ది శ్రీధర్, దశరథం, చంద్రయ్య, కో-ఆప్షన్ సభ్యులు పప్పు వెంకటేశం, కాంగ్రెస్ నాయకులు విద్యాసాగర్, రఫీక్, తమ్మల శ్యాంసుందర్, మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# మహిళా సమానత్వమే సమ సమాజం

ఆగష్టు 26 మహిళా సమానత్వ దినోత్సవం

గుమ్మడి లక్ష్మీనారాయణ, సామాజిక రచయిత




**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 25 (ప్రజా జ్యోతి)** మహిళా సమానత్వం అంటే పురుషులకు వ్యతిరేకంగా పోరాడటం కాదు, మహిళలు కూడా పురుషులతో సమానంగా తమ సామర్థ్యాలను నిరూపించుకునే అవకాశం పొందడం. ఒక మహిళ అభివృద్ధి చెందితే కుటుంబం అభివృద్ధి చెందుతుంది; మహిళలు ముందుకు సాగితే సమాజం, దేశం కూడా అభివృద్ధి చెందుతాయి. కాబట్టి ఆగష్టు 26 మనకు మహిళల హక్కుల కోసం జరిగిన చారిత్రక పోరాటాన్ని గుర్తుచేయడమే కాకుండా, "అందరికీ సమాన హక్కులు, సమాన అవకాశాలు, సమాన గౌరవం" అనే విలువలను ఆచరించాల్సిన బాధ్యతను గుర్తుచేస్తుంది. లింగ వివక్ష లేని సమాజాన్ని నిర్మించడమే ఆగస్టు 26 న నిర్వహించబోయే మహిళా సమానత్వ దినోత్సవానికి నిజమైన అర్థం. మహిళా సమానత్వ దినోత్సవం. ఇది మిగతా రోజుల్లాంటిది కాదు. మహిళలకు సమాన హక్కులు, సమాన అవకాశాలు, సమాన గౌరవం కల్పించాలనే సామాజిక బాధ్యతను గుర్తుచేసే రోజు. అమెరికాలో మహిళలకు ఓటు హక్కు కల్పించిన చారిత్రక 19వ రాజ్యాంగ సవరణ 1920 ఆగష్టు 26న ధృవీకరించబడిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈ దినోత్సవాన్ని పాటిస్తున్నారు. అయితే శతాబ్దం దాటినా ప్రపంచవ్యాప్తంగా మహిళా సమానత్వం ఇంకా పురోగతిలో వెనకే ఉంది. మహిళల ప్రగతి అంటే కేవలం మహిళలకే కాదు. అది ఒక కుటుంబం, ఒక సమాజం, ఒక దేశం అభివృద్ధికి కొలమానం. జనాభాలో సగభాగమైన మహిళలకు సమాన అవకాశాలు కల్పించకుండా దేశం సంపూర్ణ అభివృద్ధిని సాధించలేదన్నది వాస్తవం.

భారతీయ మహిళలంటే.. పూర్వం నుంచి నేటి వరకు మహిళలు దేశ చరిత్రలో కేవలం కుటుంబానికే పరిమితమైనవారు కాదని స్పష్టమవుతుంది. రాణి రుద్రమదేవి, రాణి లక్ష్మీబాయి వంటి వీరనారులు పాలనలో, యుద్ధరంగంలో తమ సత్తా చాటారు. సావిత్రిబాయి పూలే మహిళల విద్య కోసం చేసిన పోరాటం భారత సామాజిక సంస్కరణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచింది. సరోజినీ నాయుడు స్వాతంత్ర్యోద్యమంలో కీలక పాత్ర పోషించడంతో పాటు దేశానికి తొలి మహిళా గవర్నర్‌గా సేవలందించారు.

స్వాతంత్ర్య పోరాటంలో కూడా మహిళల పాత్ర విశేషమైనది. అరుణా ఆసఫ్ అలీ, ఉషా మెహతా, కస్తూర్బా గాంధీ వంటి అనేక మంది మహిళలు బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం మహిళలు తమ కుటుంబాలను, సౌకర్యాలను మాత్రమే కాదు, అవసరమైతే ప్రాణాలను సైతం త్యాగం చేశారు. నేటి భారతీయ మహిళ -- అన్ని రంగాల్లోనూ విజయపథంలో మహిళలు అడుగుపెట్టని రంగం దాదాపుగా లేదు. విద్య, వైద్యం, విజ్ఞానం, అంతరిక్షం, రక్షణ, రాజకీయాలు, న్యాయవ్యవస్థ, క్రీడలు, వ్యవసాయం, వ్యాపారం, కళలు, సాహిత్యం, సినిమా, సమాచార సాంకేతిక రంగాల్లో మహిళలు తమ ప్రతిభను నిరూపిస్తున్నారు. భారత అంతరిక్ష పరిశోధనలో మహిళా శాస్త్రవేత్తల పాత్ర విశేషమైనది. చంద్రయాన్, మంగళ్‌యాన్ వంటి ప్రతిష్ఠాత్మక కార్యక్రమాల్లో మహిళా శాస్త్రవేత్తలు కీలక బాధ్యతలు నిర్వర్తించారు. అంతరిక్షం నుంచి క్రీడా మైదానం వరకు భారతీయ మహిళ తన సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటుతోంది. క్రీడారంగంలో పీ.వి. సింధు, సైనా నెహ్వాల్, మేరీ కోమ్, సాక్షి మాలిక్, మిథాలీ రాజ్ వంటి క్రీడాకారిణులు అంతర్జాతీయ స్థాయిలో భారత జెండాను రెపరెపలాడించారు. వారి విజయాలు లక్షలాది బాలికలకు స్ఫూర్తిగా నిలిచాయి. రాజకీయ రంగంలో కూడా మహిళల ప్రాతినిధ్యం క్రమంగా పెరుగుతోంది. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం ద్వారా గ్రామస్థాయి పాలనలో వేలాది మంది మహిళలు ప్రజాప్రతినిధులుగా ఎదిగారు. దేశ అత్యున్నత రాజ్యాంగ పదవులను సైతం మహిళలు అలంకరించిన విషయంలో ఇప్పుడున్న రాష్ట్రపతి ద్రౌపతి ముర్మును భారత ప్రజాస్వామ్య ప్రగతికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు.



మహిళలు ఎన్నో విజయాలు సాధించినప్పటికీ, సమానత్వం విషయంలో ఇంకా ఆత్మపరిశీలన చేసుకోవాల్సింది చాలా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో బాలికల విద్య, మహిళల ఉపాధి, సమాన వేతనం, ఆర్థిక స్వావలంబన వంటి అంశాల్లో ఇంకా అనేక సవాళ్లు ఉన్నాయి. మహిళలపై హింస, వేధింపులు, బాల్య వివాహాలు, కట్నం, లింగ వివక్ష వంటి సమస్యలు సమాజానికి మాయని మచ్చగా మారుతున్నాయి. ఇంట్లో మహిళ చేసే శ్రమకు, బయట ఉద్యోగం చేసే మహిళపై ఇంటి బాధ్యతలన్నింటినీ మోపడం కూడా సమానత్వానికి విరుద్ధమే. అందువల్ల మహిళా సమానత్వం గురించి సభల్లో మాట్లాడటమే కాకుండా మన ఇళ్లలో, పాఠశాలల్లో, కార్యాలయాల్లో, రాజకీయ వ్యవస్థలో సమానత్వం ఆచరణలోకి రావాలి. మార్పు ఇంటి నుంచే ప్రారంభం కావాలి. ఒక అబ్బాయికి ఇచ్చే స్వేచ్ఛ,అబ్బాయి కెరీర్ గురించి తల్లిదండ్రులు ఆలోచించినట్లే అమ్మాయి భవిష్యత్తు గురించి కూడా ఆలోచించాలి. ఇంటిపనులు మహిళల బాధ్యత మాత్రమే అనే భావన మారాలి.

బాలికలకు ఆత్మవిశ్వాసం, ఆర్థిక అవగాహన, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం పెంపొందించాలి. మహిళలకు రక్షణ కల్పించడం, వారికి స్వేచ్ఛగా జీవించే వాతావరణం కల్పించడం ముఖ్యం. ఒక మహిళ ఆర్థికంగా స్వావలంబన సాధిస్తే ఒక కుటుంబానికి బలం చేకూరుతుంది. ఒక మహిళ నాయకత్వం వహిస్తే మరెంతో మంది మహిళలకు మార్గం ఏర్పడుతుంది. ప్రభుత్వాలు మహిళల విద్య, ఆరోగ్యం, ఉపాధి, భద్రత, ఆర్థిక స్వావలంబనకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలి. చట్టాలు చేయడంతో పాటు వాటి అమలును కూడా పర్యవేక్షించాలి. ఆగష్టు 26 మనకు ఒక చారిత్రక విజయాన్ని గుర్తుచేసే రోజు మాత్రమే కాదు. ఇంకా సాధించాల్సిన సమానత్వాన్ని గుర్తుచేసే రోజు కూడా. మహిళల ప్రతిభకు తగిన గుర్తింపు, కృషికి తగిన గౌరవం, జీవితానికి తగిన స్వేచ్ఛ లభించినప్పుడే నిజమైన సమానత్వం సాధ్యమవుతుంది. మన మహిళలు తమ శక్తిని ఎన్నో సందర్భాల్లో నిరూపించారు. కాబట్టి ఆమెకు ఇంకా అవకాశాలను మరింత విస్తరించడం మన బాధ్యత. మహిళను గౌరవించే కుటుంబం, సమానత్వాన్ని పాటించే సమాజం, అవకాశాలను అందించే ప్రభుత్వం కలిసి పనిచేసినప్పుడే అభివృద్ధి చెందిన భారతదేశంగా భావించగలం.

# కంటి దానం మరొకరికి వెలుగు నింపడం





-- కంటి దాన పక్షోత్సవాలు

-- జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి

**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 25 (ప్రజా జ్యోతి)** 25-08-2026 నుండి 08-09-2026 వరకు కంటి దాన పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం ఘనంగా అవగాహన ర్యాలీ.మరణానంతరం కంటి దానం -- మరొకరి జీవితంలో వెలుగులు నింపే మహోన్నత సేవ" కామారెడ్డి, ఆగస్టు 25, 2026 కంటి దానం పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించి, కంటి చూపు కోల్పోయిన వారికి కార్నియా మార్పిడి ద్వారా చూపును అందించేందుకు ప్రజలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కంటి దాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కామారెడ్డి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జె. వెంకటి తెలిపారు. కంటి దాన పక్షోత్సవాల్లో భాగంగా కామారెడ్డి ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ నుండి కామారెడ్డి రైల్వే స్టేషన్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ప్రభుత్వ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది, ఏఎన్ఎంలు లు, ఆశా కార్యకర్తలు, ఇతర ఆరోగ్య సిబ్బంది మరియు ప్రజలు పాల్గొన్నారు. కంటి దానం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ జె. వెంకటి మాట్లాడుతూ, కంటి దానం అనేది ఒక వ్యక్తి మరణానంతరం కూడా మరో ఇద్దరి జీవితంలో వెలుగును నింపే గొప్ప మానవతా సేవ అని అన్నారు. చూపు కోల్పోయిన కొంతమంది వ్యక్తులకు కార్నియా మార్పిడి ద్వారా దృష్టిని పునరుద్ధరించే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలు కంటి దానంపై ఉన్న అపోహలను తొలగించుకొని, కంటి దానం గురించి కుటుంబ సభ్యులతో ముందుగానే చర్చించుకోవాలని సూచించారు. కంటి దానం చేయాలనే సంకల్పం కుటుంబ సభ్యులకు తెలియజేయడం ఎంతో ముఖ్యమని, మరణం సంభవించినప్పుడు వెంటనే సంబంధిత కంటి బ్యాంకు లేదా అధీకృత ఆరోగ్య సంస్థకు సమాచారం అందించడం ద్వారా కంటి సేకరణకు సహకరించవచ్చని తెలిపారు.ర్యాలీ ద్వారా విస్తృత అవగాహన ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన మార్గాల మీదుగా కామారెడ్డి రైల్వే స్టేషన్ వరకు కొనసాగింది. ర్యాలీలో పాల్గొన్న వారు కంటి దానం ప్రాముఖ్యతను తెలియజేస్తూ అవగాహనా నినాదాలు చేశారు.

"కంటి దానం చేయండి -- అంధుల జీవితాల్లో వెలుగులు నింపండి"

"మరణానంతరం కంటి దానం -- మహోన్నత మానవతా సేవ"

"మీ కళ్లతో మరో ఇద్దరి జీవితాలకు చూపునివ్వండి"

"కంటి దానం -- జీవితాంతం గుర్తుండే దానం"చూపును పంచండి -- వెలుగును పెంచండి"

అనే నినాదాలతో ప్రజలకు అవగాహన కల్పించారు.

అపోహలను తొలగించాలి

కంటి దానం గురించి సమాజంలో ఉన్న అపోహలు, అనుమానాలను తొలగించేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్ఓ తెలిపారు. కంటి దానం అనేది శాస్త్రీయంగా, వైద్యపరమైన నిబంధనలకు అనుగుణంగా నిర్వహించే ప్రక్రియ అని పేర్కొన్నారు.

కంటి దానం చేయాలనే ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ అధీకృత కంటి బ్యాంకులు మరియు సంబంధిత వైద్య సంస్థల ద్వారా సరైన సమాచారం తెలుసుకోవాలని సూచించారు. కుటుంబ సభ్యుల సహకారం, సమయానుకూల సమాచారం మరియు వైద్య సిబ్బంది సమన్వయం కంటి సేకరణలో ముఖ్యమైనవని తెలిపారు.ప్రజలకు డీఎంహెచ్ఓ పిలుపు

కంటి దాన పక్షోత్సవాలను కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా, ప్రజల్లో శాశ్వతమైన సామాజిక చైతన్యాన్ని తీసుకువచ్చే ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని డాక్టర్ జె. వెంకటి పిలుపునిచ్చారు.

ప్రతి కుటుంబం కంటి దానం గురించి తెలుసుకోవాలని, కుటుంబ సభ్యులతో చర్చించి దానంపై తమ అభిప్రాయాన్ని ముందుగానే తెలియజేయాలని కోరారు. ఒక వ్యక్తి మరణానంతరం అతని/ఆమె కళ్ల ద్వారా మరో ఇద్దరు వ్యక్తులకు చూపు లభించే అవకాశం ఉండటం గొప్ప మానవతా విలువకు నిదర్శనమని తెలిపారు. "మన జీవితం ముగిసినా... మన కళ్ల ద్వారా మరొకరి జీవితంలో వెలుగు కొనసాగవచ్చు. కంటి దానం ద్వారా మరొకరికి చూపు ప్రసాదిద్దాం." అని డీఎంహెచ్ఓ పేర్కొన్నారు.

ఆరోగ్య శాఖ సిబ్బంది భాగస్వామ్యం

కంటి దాన పక్షోత్సవాల సందర్భంగా జిల్లాలోని వివిధ ఆరోగ్య సంస్థల పరిధిలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు, సమావేశాలు, ర్యాలీలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించి కంటి దానం ప్రాముఖ్యతను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు.

ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆశా కార్యకర్తలు,మరియు ఇతర ఫ్రంట్‌లైన్ ఆరోగ్య సిబ్బంది ద్వారా కుటుంబ స్థాయిలో కంటి దానంపై అవగాహన కల్పించాలని సూచించారు.

కంటి దానం గురించి సరైన సమాచారం ప్రతి కుటుంబానికి చేరేలా ఆరోగ్య శాఖ నిరంతరం కృషి చేస్తుందని డీఎంహెచ్ఓ తెలిపారు.

కార్యక్రమంలో పాల్గొన్న వారు ఈ అవగాహన ర్యాలీలో ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం లు,ఇతర ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కంటి దాన పక్షోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ ర్యాలీ ద్వారా కంటి దానం -- చూపు కోసం, మానవత్వం కోసం అనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లారు.

**ప్రజలకు ప్రత్యేక సందేశం**

కంటి దానం గురించి తెలుసుకోండి -- కుటుంబ సభ్యులతో చర్చించండి -- మరణానంతరం కంటి దానానికి ముందుకు రండి.మీ కళ్లను దానం చేయండి...

**మరొకరి జీవితంలో వెలుగులు నింపండి!**

ఈ కార్యక్రమంలో డాక్టర్ రవీందర్ గౌడ్ ఆర్ ఎం ఓ, డాక్టర్ స్వప్న, ఆప్తాలమాలజిస్ట్, డాక్టర్ రాజు ఏవో, డాక్టర్ చందన ప్రియా,ప్రెసిడెంట్ డాక్టర్ మల్లికార్జున్,రెడ్ క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్ రాజన్న, లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ప్రదీప్ కుమార్, గంగాధర్,లింబాద్రి హరికిషన్, రవీందర్, రంజిత, మహేందర్ రెడ్డి,వేణుగోపాల్, చెలపతి, విఠల్ రావు , శ్రీనివాస్ రెడ్డి ,శ్యామల,రవి , రమణ,గణేష్ తదితరులు అలాగే వర్డ్,సఖి, ఎన్జీవో ప్రతినిధులు మొదలైన వారు పాల్గొన్నారు. డాక్టర్ జె. వెంకటి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి కామారెడ్డి జిల్లా.

## పచ్చదనం పెంపే లక్ష్యంగా వనమహోత్సవం



**గాంధారి, ఆగస్టు 25 (ప్రజాజ్యోతి)** పచ్చదనం పెంపొందించడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. మంగళవారం గాంధారి మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో వనమహోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. మండల కేంద్రంలోని క్రికెట్ స్టేడియం ఆవరణలో మాస్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని చేపట్టి పెద్దఎత్తున మొక్కలు నాటారు.అదేవిధంగా పేట్‌సంగం గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో, నేరల్ తండాలో విస్తృతంగా మొక్కలు నాటారు. గాంధారిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, తహసీల్దార్ రేణుక చౌహాన్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మొజ్జం అలీఖాన్, సర్పంచ్ రేణుక-సంజీవ్, పీఏసీఎస్ చైర్మన్ సాయికుమార్, ఉపసర్పంచ్ భాస్కర్‌గౌడ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.పేట్‌సంగంలో గౌడ సంఘం సభ్యులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు. నేరల్ తండాలో ఎంపీడీవో రాజేశ్వర్, సర్పంచ్ రవీందర్, ఉపసర్పంచ్ రాథోడ్ నెహ్రూ, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు బంతియా తదితరులు మొక్కలు నాటారు. నాటిన మొక్కలను సంరక్షించడంతోనే వనమహోత్సవం లక్ష్యం నెరవేరుతుందని, భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని వారు సూచించారు.

## వనమహోత్సవం.. విద్యార్థులకు అవగాహన సదస్సు



**గాంధారి, ఆగస్టు 25 (ప్రజాజ్యోతి)** పర్యావరణ పరిరక్షణతో పాటు పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని అధికారులు సూచించారు. మంగళవారం గాంధారి మండల కేంద్రంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. క్రికెట్ స్టేడియం ఆవరణలో మాస్ ప్లాంటేషన్ చేపట్టి అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పెద్దఎత్తున మొక్కలు నాటారు.

మొక్కలు నాటిన అనంతరం మండల రేంజ్ కార్యాలయంలో జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మొజ్జం అలీఖాన్ అవగాహన సదస్సు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో చెట్ల ప్రాధాన్యత, మొక్కలను నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యతపై విద్యార్థులకు వివరించారు. భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కల సంరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, తహసీల్దార్ రేణుక చౌహాన్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మొజ్జం అలీఖాన్, సర్పంచ్ రేణుక-సంజీవ్, పీఏసీఎస్ చైర్మన్ సాయికుమార్, ఉపసర్పంచ్ భాస్కర్‌గౌడ్, వార్డు సభ్యులు, అటవీ శాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించినప్పుడే వనమహోత్సవం లక్ష్యం నెరవేరుతుందని వక్తలు పేర్కొన్నారు.

## కుల బహిష్కరణ అసత్య ప్రచారం

గోగుల్ తండా కుల సభ్యులు



**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 25 (ప్రజా జ్యోతి)** రామారెడ్డి మండల కేంద్రంలోని గోగుల్ తాండ-2 లో మంగళవారం సంఘ సభ్యులు సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని కుటుంబాల వారు సోషల్ మీడియా ద్వారా వివిధ ప్రచార మార్గాల ద్వారా కుల బహిష్కరణ చేశారు అంటూ లేనిపోని అబద్దాలను అంటకడుతున్నారని, అదేవిధంగా మా తండా సభ్యుల సమక్షంలో మేము మా తండా పరిధిలో ఎవరిని కూడా బహిష్కరించలేదు అదేవిధంగా మాపై తప్పుడు ప్రచారం చేయడమే కాకుండా స్థానిక పోలీస్ స్టేషన్, మండల తాసిల్దార్ కార్యాలయంలో కుల బహిష్కరణ చేసామని కంప్లైంట్ ఇచ్చారని ప్రచారం మాధ్యమాల ద్వారా తెలవగా వెంటనే మా సంఘ సభ్యులు స్పందించి మేము ఎవరిని బహిష్కరించలేదు ఎవరిని ఉద్దేశించి కక్షపూర్వకంగా ఎవరితో దురుసుగా ప్రవర్తించలేము అదేవిధంగా మా సంఘ కట్టుబాట్లతో అందరం కలిసే ఉన్నాం అని క్లారిటీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బాదావత్ తిరుపతి, పంతులు, కారోబార్ కిషన్, మోతిరాం, గణేష్, లింబాద్రి, జాను, గోవింద్, సంఘ సభ్యులు తెలపడం జరిగింది.

# ఏఐటీయూసీ.4 వ. జిల్లా మహాసభలు




**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 25 (ప్రజా జ్యోతి)** కామారెడ్డి పట్టణం రోటరీ క్లబ్ లో మహాసభలు నిర్వహించడం జరిగింది. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి ఎస్ బాలరాజు జెండావిష్కరణ నిర్వహించడం జరిగింది. ఈ మాసభకు . ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి బాలరాజు అధ్యక్షతన వహించగా. ఈ మహాసభలు కామారెడ్డి మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ. కేంద్ర ప్రభుత్వము అవలంబిస్తున్న కార్మికుల పట్ల విధానాల పై మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు లేక కార్మికుల చట్టాలు కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో తీసుకుందని కార్మికులకు పని గంటలు పని భద్రత కల్పించడం లేదని అదేవిధంగా కార్మికులకు కనీస వేతనాలు ఉండాలని కార్మికులకు పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం ఉండాలని అదేవిధంగా కార్మికులు మూడు పూటలా తిండి కార్మికునికి కనీస అవసరాలు వేతనం పిల్లల చదువులు ఉన్నత వర్గం పేద వర్గం ఒకేలా ఉండాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల పట్ల చిత్తశుద్ధి లేదని అన్నారు. ఇప్పటికైనా కార్మిక రంగాన్ని కేంద్ర ప్రభుత్వము పట్టించుకోవడంలేదని అన్ని రంగాలను ప్రైవేటీకరణ చేయడానికి కేంద్ర ప్రభుత్వం ముందుందని అన్నారు. కనీస ధరలు నిత్యవసర ధరలు అనేక ధరలు పెరగడం వల్ల నిరుపేద కార్మికులు బతికే పరిస్థితులు లేరని అన్నారు ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చినటువంటి కార్మిక వ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకోవాలని కార్మికులు బతకడానికి కనీస వేతనాలు ఉండాలని మహాసభల్లో అన్నారు అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో లక్షలాది మంది కార్మికులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఏఐటీయూసీ సంఘం అని కామారెడ్డి చైర్మన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ అన్నారు. అదేవిధంగా నాలుగోవ జిల్లా మహాసభలకు ముఖ్య అతిథులుగా హాజరైనందుకు చాలా సంతోషంగా ఉందని ఇప్పటికైనా కార్మికుల సమస్యలు కేంద్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా కార్మికుల సమస్యలు భవిష్యత్తులో పరిష్కారానికి ముందుంటానని మహాసభల్లో పిలుపునిచ్చారు. కామారెడ్డి జిల్లా ఏఐటీయూసీ నాలుగో రోజు జిల్లా మహాసభలకు ముఖ్య అతిథులుగా రావడం చాలా సంతోషంగా ఉందని ముందు ముందు కార్మికుల సమస్యల పైన పరిష్కార దిశగా పనిచేస్తానని మహాసభల్లో మాట్లాడడం జరిగింది. కేంద్ర ప్రభుత్వము పెంచిన నిత్యవసర దళాలను ఇతర ధరలు పెట్రోల్ గ్యాస్ అదేవిధంగా రైతుల సమస్యలను కార్మికుల సమస్యలు పరిష్కారమే వరకు పోరాటాలు నిర్వహించాలని మాట్లాడడం జరిగింది. అనంతరం రాష్ట్ర కార్యదర్శి ఏఐటీయూసీ ఎస్ బాలరాజు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలన్నీ అంబానీ ఆదాని అనుకూలంగా కేంద్ర ప్రభుత్వము పనిచేస్తుందని కనీసం మనిషి బతకడానికి కనీస వేతనం లేక కార్మికుడు కార్మికుడుగానే మిగిలిపోతున్నారని అన్నారు. జిల్లా సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని నల్లధనాన్ని తీసుకురావాలని పెంచిన ధరలు తగ్గించాలని కార్మికుల 44 చట్టాలను నాలుకోడ్లుగా విభజించడాన్ని సరైంది కాదని ఇప్పటికైనా కార్మికుల సమస్యలు పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం మేల్కొకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున కార్మిక సంఘాలను కలుపుకొని దేశవ్యాప్తంగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమంలో నిర్వహిస్తామని అన్నారు. ఏఐటీయూసీ నాలుగవ రాష్ట్ర మహాసభలు సెప్టెంబర్ 6 నుండి 8 వరకు కరీంనగర్ పట్టణంలో రాష్ట్ర మహాసభలు సెప్టెంబర్ 6న భారీ ర్యాలీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఈ మహాసభకు ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ అమర్ జీత్ కౌర్ హాజరవుతారని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్ బాలరాజు అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను వీడేనాడాలని లేనియెడల భవిష్యత్తులో కార్మిక వర్గం జరిగే పోరాటాలకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాల నలుమూలల నుండి మహాసభల్లో పాల్గొనడం జరిగిందని కార్మిక వర్గానికి భవిష్యత్తు పోరాటాలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి. బాలరాజ్ జిల్లా అధ్యక్షులు ఎస్. బాలరాజ్ జిల్లా ఉపాధ్యక్షులు దశరథ్ లక్ష్మణ్ జిల్లా నాయకులు ప్రవీణ్ రఫిక్ శ్రీనివాస్ భీమయ్య బాజీ రాజిరెడ్డి దుబాస్ రాములు ఆర్ లక్ష్మణ్ జి రాజు రాజేందర్ సునీత విజయలక్ష్మి అనిత రాజ్యలక్ష్మి లావణ్య, భీమయ్య, బాజీ, శ్రీనివాస్, కృష్ణ, రాజేందర్, బాల్రాజ్, ఖదీర్, వెంకట్ గౌడ్, శివాజీ, దేవరాజు, గంగయ్య, రాములు, ఈ కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో మహాసభలో పాల్గొనడం జరిగింది.




# టెక్రియాల్ చెరువు కాలుష్యంతో ఇబ్బందులు

పశువులకు తీవ్ర ఇబ్బందులు

వినాయక విగ్రహాల నిమజ్జనాలతో నీరు కలుషితం..

పంటలపై ప్రతికూల ప్రభావం

చెరువు నీటిని వినియోగించే పశువులకు అనారోగ్య సమస్యలు.

స్నానాలు చేసే ప్రజలకు చర్మవ్యాధులు

నీటి నాణ్యతపై శాస్త్రీయ పరీక్షలు నిర్వహించి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థుల డిమాండ్



**కామారెడ్డి టౌన్ ఆగస్టు 25 ప్రజా జ్యోతి** కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టెక్రియాల్ గ్రామంలో సుమారు 560 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు కాలుష్య కోరల్లో చిక్కుకోవడంతో రైతులు, పశువుల పెంపకందారులు, గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకప్పుడు గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న ఈ చెరువు ప్రస్తుతం కలుషిత నీటితో దుర్వినియోగంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు నీటి నాణ్యత రోజురోజుకూ దిగజారుతుండటంతో పంటల సాగుతో పాటు పశువుల ఆరోగ్యం, ప్రజల ఆరోగ్యంపై కూడా ప్రభావం పడుతోందని గ్రామస్థులు చెబుతున్నారు.

ఒకప్పుడు ప్రజల అవసరాలు తీర్చిన చెరువు

స్థానికుల వివరాల ప్రకారం దాదాపు పది నుంచి పదిహేనేళ్ల క్రితం వరకు టెక్రియాల్ చెరువు నీరు ప్రజలు వినియోగించుకునే స్థాయిలో ఉండేది. తాగునీటి అవసరాలతో పాటు పలు గృహ అవసరాలకు, పశువులకు, వ్యవసాయానికి చెరువు నీటిని ఉపయోగించుకునేవారు. చెరువు నీరు స్వచ్ఛంగా ఉండటంతో గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేదని వృద్ధులు గుర్తుచేస్తున్నారు. అయితే కాలక్రమేణా చెరువులోకి వివిధ రకాల వ్యర్థాలు చేరడం, వినాయక విగ్రహాల నిమజ్జనాలు నిర్వహించడం తదితర కారణాలతో నీటి నాణ్యత పూర్తిగా దెబ్బతిన్నదని వారు పేర్కొంటున్నారు.

వినాయక విగ్రహాల నిమజ్జనాలతో కాలుష్యం

ప్రతి సంవత్సరం వినాయక చవితి సందర్భంగా పెద్ద సంఖ్యలో విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేయడం వల్ల విగ్రహాల తయారీలో ఉపయోగించే రంగులు, రసాయన పదార్థాలు, ఇతర సామగ్రి నీటిలో కలుస్తున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. నిమజ్జనం అనంతరం విగ్రహాల అవశేషాలు, పూజా సామగ్రి తదితరాలు చెరువులోనే మిగిలిపోవడంతో నీటి కాలుష్యం మరింత పెరుగుతోందని చెబుతున్నారు.

ఇక భవిష్యత్తులో చెరువు నీరు మరింత కలుషితం కాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని, విగ్రహాల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసి చెరువు నీటి పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పశువులు నీరు తాగేందుకు నిరాకరణ

చెరువు నీరు కలుషితం కావడంతో పశువులు సైతం ఆ నీటిని తాగేందుకు నిరాకరిస్తున్నాయని పశువుల పెంపకందారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో కలుషిత నీటిని తాగిన పశువులు అనారోగ్యానికి గురవుతున్నాయని, కొన్ని సందర్భాల్లో పశువులు మృతి చెందిన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయని వారు చెబుతున్నారు. పశువుల ఆరోగ్యంపై ప్రభావం పడటంతో వాటి పెంపకంపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొంటున్నారు.

**సాగునీటితో పంటలకు నష్టం**

చెరువు నీటిపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతుల పరిస్థితి కూడా ఆందోళనకరంగా మారిందని రైతులు చెబుతున్నారు. కలుషిత నీటిని పొలాలకు వినియోగించడం వల్ల పంటలపై ప్రతికూల ప్రభావం పడుతోందని, పంటల ఎదుగుదల దెబ్బతినడంతో పాటు దిగుబడులు తగ్గుతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికే వ్యవసాయ రంగంలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్న రైతులకు చెరువు నీటి కాలుష్యం మరో సమస్యగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉదయం స్నానాలు చేసే ప్రజలకు చర్మ సమస్యలు

చెరువు నీటిని వ్యవసాయానికి, పశువులకు మాత్రమే కాకుండా గ్రామంలోని పలువురు ప్రజలు ఇప్పటికీ వివిధ అవసరాలకు ఉపయోగిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా ప్రతిరోజూ ఉదయం అనేక మంది చెరువు వద్ద స్నానాలు చేస్తున్నారని, నీటి నాణ్యత దెబ్బతినడంతో కొంతమందికి చర్మ సంబంధిత సమస్యలు, దురద వంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ సమస్యలకు చెరువు నీటి కాలుష్యమే కారణమని నిర్ధారించేందుకు శాస్త్రీయ పరీక్షలు అవసరమని స్థానికులు పేర్కొంటున్నారు.

**నీటి నమూనాలు సేకరించి పరీక్షలు చేయాలి**

టెక్రియాల్ చెరువు నీటి నాణ్యతపై సంబంధిత అధికారులు వెంటనే దృష్టి సారించాలని గ్రామస్థులు కోరుతున్నారు. చెరువు నుంచి నీటి నమూనాలను సేకరించి ప్రయోగశాలలో శాస్త్రీయంగా పరీక్షలు నిర్వహించాలని, నీటిలో ఉన్న కాలుష్య కారకాలు, రసాయనాల స్థాయిని గుర్తించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పరీక్షల ఫలితాల ఆధారంగా ప్రజలు, పశువులు, పంటలకు ఎలాంటి ప్రమాదం ఉందో స్పష్టత వస్తుందని చెబుతున్నారు.

**కలెక్టర్ ప్రత్యేకంగా స్పందించాలి**

టెక్రియాల్ చెరువు కాలుష్య సమస్యపై జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించి సంబంధిత శాఖల అధికారులతో సమగ్ర పరిశీలన చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు. చెరువు కాలుష్యానికి ప్రధాన కారణాలను గుర్తించి, అవసరమైన శుద్ధి చర్యలు చేపట్టడంతో పాటు భవిష్యత్తులో మళ్లీ కాలుష్యం జరగకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. చెరువు నీటిపై ఆధారపడి జీవిస్తున్న రైతులు, పశువుల పెంపకందారులు, గ్రామ ప్రజల సమస్యలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. చెరువు పునరుద్ధరణ, నీటి శుద్ధి, కాలుష్య నివారణ చర్యలకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని డిమాండ్ చేస్తున్నారు.

టెక్రియాల్ చెరువు నీటి కాలుష్యంపై అధికారులు సమగ్రంగా విచారణ జరిపి, నీటి నమూనాల పరీక్షల ద్వారా వాస్తవ పరిస్థితులను వెలుగులోకి తీసుకురావడంతో పాటు రైతులు, పశువుల పెంపకందారులు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని టెక్రియాల్ గ్రామస్థులు జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నారు.

# గౌడ సంఘం మండల అధ్యక్షుడిగా ప్రశాంత్ గౌడ్



**ఎల్లారెడ్డి, ఆగస్టు -25(ప్రజా జ్యోతి )** ఎల్లారెడ్డి మండల గౌడ సంఘం మండల అధ్యక్షుడిగా మాత్తమల్ ప్రశాంత్ గౌడ ను ఎన్నుకోవడం జరిగిందని మండల గౌడ సంఘం సభ్యులు అన్నారు. మండల గౌరవ అధ్యక్షులు సాయ గౌడ్ అధ్యక్షతన ఈ సమ్మేళనంలో మండల గౌడ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ కాలపరిమితి మూడు సంవత్సరాలు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గం అధ్యక్షులు ప్రశాంత్ గౌడ్, ఉపాధ్యక్షులు రఘువీర్ గౌడ్, ముఖ్య కార్యదర్శి ఉష గౌడ్,సహాయ కార్యదర్శి నారా గౌడ్,ముఖ్య సలహాదారుడు జగన్ గౌడ్ లను మండల గౌడ సంఘ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్బంగా ప్రశాంత్ గౌడ్ మాట్లాడుతూ.. నాపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన వారికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. గౌడ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాన్నాని అన్నారు. ఈ కార్యక్రమంలో కిరణ్ గౌడ్, జీవన్ గౌడ్, సాయిబాబా గౌడ్, ఈశ్వర్ గౌడ్, కషా గౌడ్, శ్రీనివాస్ గౌడ్, నరేందర్ గౌడ్, బాలరాజు గౌడ్ తో పాటు మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన గౌడ సంఘ సభ్యులు, గౌడ కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులకు ఒకరోజు శిక్షణ




**ఎల్లారెడ్డి, ఆగస్టు 25(ప్రజా జ్యోతి )** జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం మంగళవారం కేంద్రం కాలాభారతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు.దివ్యాంగ విద్యార్థుల విద్యాభివృద్ధి, వారికి ప్రభుత్వం అందిస్తున్న విద్యా సదుపాయాలు, ప్రత్యేక విద్యా విధానాలు, తల్లిదండ్రుల పాత్ర తదితర అంశాలపై ఈ శిక్షణలో అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ మండలాల నుంచి దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు, జిల్లా విద్యాశాఖ అధికారులు, సహిత విద్యా సిబ్బంది, ఐఈఆర్‌పీలు హాజరయ్యారు.దివ్యాంగ విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి వారి విద్యాభ్యాసానికి అవసరమైన సహకారం అందించడం, పాఠశాలల్లో వారికి అందుతున్న ప్రత్యేక సౌకర్యాలను సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి మండలానికి చెందిన ఐఈఆర్‌పీ డి. వెంకటేశం విధుల్లో ప్రతిభ కనబరుస్తూ దివ్యాంగ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అందిస్తున్న విశిష్ట సేవలకు గాను జిల్లా విద్యాధికారి మల్లికార్జున్ చేతుల మీదుగా ఉత్తమ ఐఈఆర్‌పీగా సన్మానం అందుకున్నారు. జ్ఞాపికను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహిత విద్యా అధికారులు నాగవేందర్, కృష్ణ చైతన్య, జిల్లా విద్యాశాఖ అధికారులు, వివిధ మండలాల ఐఈఆర్‌పీలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# విద్యార్థుల యూనిఫార్మ్‌ల తయారీలో నాణ్యత తప్పనిసరి



**గాంధారి, ఆగస్టు 25 (ప్రజాజ్యోతి)** గాంధారి మండల కేంద్రంలో పాఠశాల విద్యార్థుల యూనిఫార్మ్‌ల తయారీ కోసం ఏర్పాటు చేసిన కటింగ్ సెంటర్‌ను మంగళవారం ఎంఈఓ శ్రీహరి పరిశీలించారు. ఈ సందర్భంగా కటింగ్, స్టిచ్చింగ్ పనుల తీరును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఎంఈఓ శ్రీహరి మాట్లాడుతూ విద్యార్థులకు అందించే యూనిఫార్మ్‌ల తయారీలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కొలతలకు అనుగుణంగా కటింగ్ చేసి, నాణ్యమైన స్టిచ్చింగ్‌తో యూనిఫార్మ్‌లను సిద్ధం చేయాలన్నారు. తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, స్టిచ్చింగ్ నాణ్యతపై కటింగ్ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు.ఈ కార్యక్రమంలో ఏపీఎం ప్రసన్నకుమార్, మండల సమాఖ్య అధ్యక్షురాలు పుష్పరాణి, సీసీలు గొర్రె రాములు, రాజయ్య, శేఖర్, అకౌంటెంట్ సుధాకర్ పాల్గొన్నారు.

# కాలభైరవ స్వామికి సింధూర పూజలు



**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 25 (ప్రజా జ్యోతి)** రామారెడ్డి మండల కేంద్రంలోని ఈసన్నపల్లి- రామారెడ్డి గ్రామాలలో కొలువై ఉన్న పవిత్రమైన పుణ్యక్షేత్రం దక్షిణ కాశీగా పిలవబడుతున్న శ్రీ కాలభైరవ స్వామి వారికి ఘనంగా శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక సింధూర పూజలను వేద పండితుల పురోహితుల మంత్రోచ్ఛారణతో ఆలయ సిబ్బంది ఘనంగా నిర్వహించడం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. తదుపరి ఆలయ సిబ్బంది అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభు రామచంద్రం గుప్త, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, పూజారి శ్రీనివాస్ శర్మ, ఆలయ సహాయకులు నాగరాజు, భరత్,

# ప్రతి ఇంటికి రెండు మొక్కల పంపిణీ

**వన మహోత్సవంలో మొక్కలు నాటిన గూడెం సర్పంచ్ యాదగిరి గౌడ్ పి ఏ సి ఎస్ చైర్మన్ గూడెం శ్రీనివాస్ రెడ్డి**

**-- స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ**

**కామారెడ్డి టౌన్ ఆగస్టు 25 ప్రజా జ్యోతి** కామారెడ్డి మండలం గూడెం గ్రామంలో పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా కామారెడ్డి మండలంలోని గూడెం గ్రామంలో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు ప్రతి కుటుంబం మొక్కలను పెంచేలా ప్రజల్లో అవగాహన కల్పించారు. వన మహోత్సవంలో భాగంగా గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు కలిసి మొక్కలు నాటారు. నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, మొక్కలను నాటడం మాత్రమే కాకుండా అవి ఏపుగా పెరిగే వరకు క్రమం తప్పకుండా నీరు పోసి సంరక్షించాలని సూచించారు. పచ్చని చెట్లు వాతావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందిస్తాయని పేర్కొన్నారు.

అదేవిధంగా గ్రామంలో పచ్చదనం మరింత పెంపొందించాలనే ఉద్దేశంతో ప్రతి ఇంటికి రెండు మొక్కలను పంపిణీ చేశారు. ప్రతి కుటుంబం తమకు అందించిన మొక్కలను ఇంటి పరిసరాల్లో నాటి వాటిని సంరక్షించాలని కోరారు. గ్రామంలోని ప్రతి ఇంటి వద్ద మొక్కలు పెరిగేలా చర్యలు తీసుకోవడం ద్వారా గూడెం గ్రామాన్ని పచ్చని గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి





చేయాలని పిలుపునిచ్చారు.

ఇదే కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డులను కూడా పంపిణీ చేశారు. అర్హులైన కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హత కలిగిన ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ వ్యవస్థ మరింత పారదర్శకంగా, సులభతరంగా మారుతుందని తెలిపారు.

ఈ సందర్భంగా సి.ఏ.సి.ఎస్. చైర్మన్ గూడెం శ్రీనివాస్ రెడ్డి, గ్రామ సర్పంచ్ యాదగిరి గౌడ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో గ్రామ ప్రజలు చురుకుగా పాల్గొనడం అభినందనీయమన్నారు. ప్రతి ఇంటికి రెండు మొక్కలు అందించడం ద్వారా గ్రామంలో పచ్చదనం పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. మొక్కలను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం పరిధిలోని సిబ్బంది, పాలకవర్గ సభ్యులు, డైరెక్టర్లు, గ్రామ పంచాయతీ సెక్రటరీ సంగీత, గ్రామ ప్రజల సమక్షంలో మొక్కల పంపిణీ, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు.

కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, డైరెక్టర్లు, గ్రామ పంచాయతీ సెక్రటరీ సంగీత, ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల ప్రజలు, మహిళలు, యువత, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు.

## సారంపల్లి మల్లారెడ్డి సేవలు చిరస్మరణీయం

**గాంధారి, ఆగస్టు 25 (ప్రజాజ్యోతి)** కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి మరణం సీపీఎం పార్టీకి తీరని లోటని సీపీఎం ఎల్లారెడ్డి ఏరియా కార్యదర్శి మోతీరామ్ నాయక్ అన్నారు. మంగళవారం సీపీఎం కమిటీ ఆధ్వర్యంలో మల్లారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మోతీరామ్ నాయక్ మాట్లాడుతూ.. సారంపల్లి మల్లారెడ్డి తన జీవితాన్ని రైతుల కోసం అంకితం చేసిన త్యాగజీవి అని కొనియాడారు. రైతుల సమస్యలు, పంటలకు ప్రభుత్వ సహకారం తదితర అంశాల్లో ప్రభుత్వాలకు సలహాలు, సూచనలు అందిస్తూ రైతాంగం కోసం నిరంతరం కృషి చేశారని తెలిపారు.



జాతీయ స్థాయిలో కిసాన్ సభకు ఉపాధ్యక్షుడిగా మూడు దఫాలు ఎన్నికై సేవలందించారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలోనూ అగ్రభాగాన నిలిచి పోరాడిన వీరుడని అన్నారు. తన కుటుంబాన్ని సైతం పార్టీ సిద్ధాంతాల వైపు నడిపించిన నాయకుడని కొనియాడారు. రైతు రంగానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. పోరాటాలను రూపొందించడంలో, ముందుకు నడిపించడంలో ఆయనకు విశేష అనుభవం ఉందని, విప్లవ యోధుడిగా ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు ప్రకాష్ నాయక్, కిషన్‌రావు, మధు, జోహార్‌సింగ్ తదితరులు పాల్గొని మల్లారెడ్డికి జోహార్లు అర్పించారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

**-- వైద్యాధికారి డాక్టర్ సురేష్**





**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 25 (ప్రజా జ్యోతి)** రామారెడ్డి పీహెచ్‌సీ ఆవరణలో పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం మరియు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించే ఉద్దేశంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డా. ఎం. సురేష్, మెడికల్ ఆఫీసర్, పీహెచ్‌సీ రామారెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించి, పీహెచ్‌సీ ఆవరణలో వివిధ రకాల మొక్కలను నాటారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా మరియు పచ్చదనంతో నింపడం ద్వారా రోగులకు, సిబ్బందికి ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని డా. సురేష్ తెలిపారు. మొక్కలు నాటడమే కాకుండా, వాటిని నిరంతరం సంరక్షించి, తగిన నీరు అందిస్తూ పెంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజు, ఫార్మసిస్టులు రాజు, శ్రీహరి, ఇన్‌చార్జ్ సూపర్‌వైజర్ రాజమణి, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## వనమహోత్సవంలో ఎంపీడీవో



**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 25 (ప్రజా జ్యోతి)** రామారెడ్డి మండల పరిధిలోని మోషంపూర్ గ్రామములో మంగళవారం వనమహోత్సవంలో భాగముగా పీపీవీ పక్కన సర్పంచ్ మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమములో సర్పంచ్ ,ఎంపీడీవో నాగేశ్వర్ గుప్తా, ఏపివో ధర్మారెడ్డి,ఉప సర్పంచ్, టెక్నికల్ అసిస్టెంట్, మరియు వార్డ్ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న అవకాశాలను

# సద్వినియోగం చేసుకోవాలి

**చిన్న మల్లారెడ్డి పి ఎం శ్రీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాధికారి మల్లికార్జున్, జిల్లా సైన్స్ అధికారి సిద్దిరామ్ రెడ్డి పర్యటన**

**కామారెడ్డి టౌన్ ఆగస్టు 25 ప్రజా జ్యోతి** చిన్న మల్లారెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న నాణ్యమైన విద్య, ఆధునిక సదుపాయాలు, సృజనాత్మక అభ్యసన అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని కామారెడ్డి జిల్లా విద్యాధికారి మల్లికార్జున్ సూచించారు. మంగళవారం చిన్న మల్లారెడ్డిలోని పి ఎం శ్రీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాధికారి మల్లికార్జున్, జిల్లా సైన్స్ అధికారి సిద్దిరామ్ రెడ్డి సందర్శించారు. పాఠశాలలో ప్రార్థనా కార్యక్రమం జరుగుతున్న సమయంలో అధికారులు పాఠశాలకు చేరుకుని విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యాభ్యాసం, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, బోధనా విధానం తదితర అంశాలపై ఆరా తీశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన, సృజనాత్మక విద్యను అందించడంతో పాటు వారి ప్రతిభను వెలికితీసే విధంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని జిల్లా విద్యాధికారి తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ, తమలోని ప్రతిభను గుర్తించి భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగాలని సూచించారు.

**సైన్స్ ల్యాబ్‌ను పరిశీలించిన అధికారులు**

అనంతరం జిల్లా విద్యాధికారి, జిల్లా సైన్స్ అధికారి పాఠశాలలోని సైన్స్ ల్యాబ్‌ను సందర్శించి అక్కడ విద్యార్థులకు



అందుబాటులో ఉన్న ప్రయోగ పరికరాలు, సైన్స్ బోధనకు సంబంధించిన వసతులను పరిశీలించారు. ల్యాబ్‌లో ఉన్న వివిధ ప్రయోగ పరికరాలపై విద్యార్థులకు ఉన్న అవగాహనను అధికారులు స్వయంగా ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. సైన్స్‌ను కేవలం పుస్తకాలకే పరిమితం చేయకుండా ప్రయోగాత్మకంగా బోధించడం ద్వారా విద్యార్థుల్లో సబ్జెక్టుపై మరింత ఆసక్తి, అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు.

సైన్స్ ల్యాబ్‌ను ఉపాధ్యాయులు బోధనా ప్రక్రియలో ఎంతవరకు వినియోగిస్తున్నారనే విషయాన్ని కూడా అధికారులు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రయోగాత్మకంగా సైన్స్ బోధన అందుతున్న తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠ్యాంశాలను ప్రయోగాలతో అనుసంధానం చేస్తూ బోధిస్తే విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానం పెంపొందుతుందని తెలిపారు.

**నాణ్యమైన బోధనపై దృష్టి పెట్టాలి**

పాఠశాలలో ఉపాధ్యాయుల బోధనా విధానం, పనితీరు, విద్యార్థుల అభ్యసన స్థాయిని అధికారులు పరిశీలించారు. విద్యార్థులలో చదువుపై ఆసక్తిని పెంపొందించేలా వినూత్న బోధనా పద్ధతులను అవలంబించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి విద్యార్థి అభ్యసన స్థాయిని గుర్తించి, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా బోధన అందిస్తూ వారి విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని సూచించారు.

**వన మహోత్సవంలో మొక్కలు నాటిన అధికారులు**

వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో జిల్లా విద్యాధికారి మల్లికార్జున్, జిల్లా సైన్స్ అధికారి సిద్దిరామ్ రెడ్డి ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, పచ్చదనం పెంపొందించేందుకు విద్యార్థులు కూడా చురుకుగా భాగస్వాములు కావాలని అధికారులు సూచించారు. నాటిన మొక్కలను సంరక్షించి అవి పెద్ద చెట్లుగా ఎదిగేలా బాధ్యత తీసుకోవాలని విద్యార్థులకు తెలిపారు.

పాఠశాల ఆవరణలో మరింత పచ్చదనం పెంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయి రెడ్డి, ఉపాధ్యాయులు బుచ్చిరెడ్డి, ప్రవీణ్ కుమార్, గోపాల్, ప్రభాకర్, సుశీల, రాజ్యలక్ష్మి, సి ఆర్ పి చిరంజీవి, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వన మహోత్సవంలో మొక్కలు నాటిన అధికారులు, ప్రజా ప్రతినిధులు




**డోంగ్లి ఆగస్టు 24 (ప్రజాజ్యోతి)** డోంగ్లి మండలం కేంద్రంలో వన మహోత్సవంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు ప్రభుత్వ కార్యలయ ఆవరణలో మొక్కలు నాటారు. ప్రత్యేక అధికారి రమ్య, సర్పంచ్ రేఖా శివాజీ పటేల్, ఎంపీడీఓ జగదీష్ అనిల్ కుమార్, ఎంఈఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సవాయిసింగ్ పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని వారు సూచించారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ పార్టీ

**ఎల్లారెడ్డి, ఆగస్టు 25(ప్రజా జ్యోతి )** ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ పార్టీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి ఎల్లారెడ్డి సీఐ రాజిరెడ్డి, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు విద్యాసాగర్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐరాజారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. చదువుపట్ల శ్రద్ధ వహించి,




ఉన్నత చదువులు, పీజీ కోర్సులు అభ్యసించి ఉస్మానియా క్యాంపస్ వంటి అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాలలో సీట్లు సంపాదించి, సమాజంలో గౌరవప్రదమైన ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు. కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు విద్యాసాగర్ మాట్లాడుతూ, కళాశాల ఏర్పడిన తొలినాళ్లలో తక్కువ మంది విద్యార్థులు ఉండేవారని, నేడు అధిక సంఖ్యలో విద్యార్థులు చేరడం అభినందనీయమని, మంచి ఉద్యోగాలు సంపాదించి ఎల్లారెడ్డి పేరు ప్రతిష్టలను అగ్రస్థానంలో నిలపాలని కోరారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ అందరినీ అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఈ. లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. చంద్రకాంత్, సమన్వయకర్త డాక్టర్ వి. శంకరయ్య, శివకుమార్, అధ్యాపకులు శశిధర్, నాగనిక, ఎస్. చంద్రకాంత్, జి. రాణి, డాక్టర్ గంగారెడ్డి, డాక్టర్ గోదావరి, కృష్ణ ప్రసాద్, సంతోష్, రాజు, సురేష్ రెడ్డి, సంగీత, స్వప్న, మహమూద్, నరేష్, లక్ష్మణ్, పవన్, వరుణ్, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతువేదిక వద్ద వనమహోత్సవ కార్యక్రమం

**ఎల్లారెడ్డి, ఆగస్టు 25(ప్రజా జ్యోతి )** ఎల్లారెడ్డి మండలం మీసన్‌పల్లి రైతు వేదిక వద్ద ఎంపీడీఓ తాహేరా బేగం ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎల్లారెడ్డి ఆర్డీఓ ప్రభాకర్,తహసీల్దార్ ప్రేమ్ కుమార్,ఏఎంసీ చైర్మన్ రజిత వెంకట్రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కురుమ సాయిబాబా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పచ్చదనం పెంపుదల, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ తాహెరా బేగం, తహసీల్దార్ ప్రేమ్ కుమార్,సర్పంచ్ మైసయ్య,ఏపీఓ, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



# మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**తిమ్మకపల్లి గ్రామంలో వన మహోత్సవ కార్యక్రమం -- పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు**





**కామారెడ్డి టౌన్ ఆగస్టు 25 ప్రజా జ్యోతి** కామారెడ్డి మండలం, తిమ్మకపల్లి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని తిమ్మకపల్లి గ్రామ సర్పంచ్ గుర్రాల లక్ష్మి సూచించారు. కామారెడ్డి మండలం తిమ్మకపల్లి గ్రామంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రైమరీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది కలిసి మొక్కలు నాటారు.

గ్రామ పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుర్రాల లక్ష్మి, ఉప సర్పంచ్ గొర్రె పరమేశ్వర్, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొని పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం పరిసరాల్లో పలు రకాల మొక్కలను నాటారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా గ్రామాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని వారు పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఈ సందర్భంగా సర్పంచ్ గుర్రాల లక్ష్మి మాట్లాడుతూ వన మహోత్సవ కార్యక్రమం ఉద్దేశం కేవలం మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించి పెద్ద చెట్లుగా పెంచడం అని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాల్లో, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలని సూచించారు. గ్రామంలో పచ్చదనం పెంపొందించేందుకు గ్రామ పంచాయతీ తరఫున నిరంతరం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉప సర్పంచ్ గొర్రె పరమేశ్వర్ మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల పర్యావరణ సమతుల్యత కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. నాటిన ప్రతి మొక్కను బాధ్యతగా సంరక్షించాలని గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు.

విద్యార్థుల్లో పర్యావరణంపై అవగాహన పెంచాలి

ప్రైమరీ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటిన సందర్భంగా పాఠశాల హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులకు చిన్ననాటి నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మొక్కల ప్రాధాన్యత, చెట్ల వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించి, నాటిన మొక్కల సంరక్షణలో వారిని భాగస్వాములను చేయాలని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం వద్ద కూడా మొక్కలు నాటి చిన్నారులకు పచ్చదనం, చెట్ల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. పచ్చని వాతావరణం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, ప్రతి కుటుంబం మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుర్రాల లక్ష్మి, ఉప సర్పంచ్ గొర్రె పరమేశ్వర్, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాస్, ప్రైమరీ పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# క్యాసంపల్లి తండాలో ఘనంగా స్మార్ట్ కార్డుల పంపిణీ

**వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటిన గ్రామస్తులు -- ప్రతి ఇంటికి రెండు మొక్కల పంపిణీ**





**కామారెడ్డి టౌన్ ఆగస్టు 25 ప్రజా జ్యోతి** కామారెడ్డి మండలం క్యాసంపల్లి తండా గ్రామంలో మంగళవారం స్మార్ట్ కార్డుల పంపిణీతో పాటు వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న పచ్చదనం--పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. గ్రామాన్ని పచ్చదనంతో నింపడంతో పాటు ప్రతి ఇంటికీ రెండు మొక్కలను పంపిణీ చేసి వాటిని సంరక్షించేలా ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భూక్య శ్రీనివాస్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని చిన్ననాటి నుంచి పెంచి సంరక్షించినప్పుడే వన మహోత్సవం లక్ష్యం నెరవేరుతుందని తెలిపారు. ప్రతి ఇంటికీ రెండు మొక్కలను అందించడం ద్వారా గ్రామంలోని ప్రతి కుటుంబాన్ని పచ్చదనం కార్యక్రమంలో భాగస్వాములను చేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామంలో నాటిన మొక్కలను సంరక్షించేందుకు ప్రజలు బాధ్యత తీసుకోవాలని కోరారు. అనంతరం గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటి వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే గ్రామంలోని కుటుంబాలకు రెండు చొప్పున మొక్కలను పంపిణీ చేశారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటానికి చెట్ల పెంపకం ఎంతో అవసరమని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అధికారులు సూచించారు. ఇదే కార్యక్రమంలో గ్రామ ప్రజలకు స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను అర్హులైన ప్రతి కుటుంబానికి అందించడంలో స్మార్ట్ కార్డులు ఉపయోగకరంగా ఉంటాయని అధికారులు తెలిపారు. ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూక్య శ్రీనివాస్, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, పంచాయతీ సెక్రెటరీ నాగరాణి, జీపీ అధికారులు, అంగన్వాడీ టీచర్లు, ఆయమ్మలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో స్మార్ట్ కార్డుల పంపిణీతో పాటు మొక్కలు నాటడం, ప్రతి ఇంటికీ మొక్కల పంపిణీ చేయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# కోటాల్‌పల్లిలో ఘనంగా వన మహోత్సవం

**మొక్కలు నాటిన సర్పంచ్, ప్రజాప్రతినిధులు -- అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన సర్పంచ్ ఆకుల శ్యామ్ కుమార్**



**కామారెడ్డి టౌన్ ఆగస్టు 25 ప్రజా జ్యోతి** కామారెడ్డి మండలం కోటాల్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్రామంలోని పలు ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ ప్రజలు కలిసి మొక్కలు నాటారు. గ్రామంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు నాటిన మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఆకుల శ్యామ్ కుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం ఎంతో అవసరమని అన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటికి క్రమం తప్పకుండా నీరు అందిస్తూ సంరక్షించాలని గ్రామ ప్రజలకు సూచించారు. గ్రామాన్ని పచ్చదనంతో నింపేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ

వన మహోత్సవ కార్యక్రమం అనంతరం సర్పంచ్ ఆకుల శ్యామ్ కుమార్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో పిల్లలకు అందుతున్న సేవలు, హాజరు, భోజన ఏర్పాట్లు తదితర అంశాలను పరిశీలించారు. పిల్లలను ప్రతిరోజూ అంగన్‌వాడీ కేంద్రానికి తీసుకువచ్చేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు.

ప్రభుత్వ మెనూ ప్రకారం ప్రతిరోజూ వంట చేయాలని, పిల్లలకు నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందించాలని సర్పంచ్ సూచించారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయరాదని స్పష్టం చేశారు. పిల్లలకు భోజనం అందించే సమయంలో ఆయమ్మలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పిల్లలు స్వయంగా తినలేని పరిస్థితిలో వారికి భోజనం తినిపించాలని సూచించారు.

అదేవిధంగా చిన్నారులు బాత్రూంకు వెళ్లే సమయంలో కూడా ఆయమ్మలు వారిని గమనిస్తూ అవసరమైన సహాయం అందించాలని సర్పంచ్ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడంతో పాటు వారి ఆరోగ్యం, పోషణ, వ్యక్తిగత పరిశుభ్రతపై సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.

పిల్లల హాజరు ప్రతిరోజూ మెరుగ్గా ఉండేలా తల్లిదండ్రులతో సమన్వయం చేసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలు చిన్నారులకు పూర్తిస్థాయిలో అందేలా చూడాలని సర్పంచ్ పేర్కొన్నారు. చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అంగన్‌వాడీ సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోపాల్, వార్డు సభ్యులు గంగయ్య, లత, బాలయ్య, గీత, రమేష్, పంచాయతీ కార్యదర్శి దేవలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ సురేఖ, ఏఎన్ఎం విమల, గ్రామ పాలన అధికారి అశోక్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. వన మహోత్సవ కార్యక్రమంలో గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొని మొక్కలు నాటారు.

# పీఏసీఎస్ కేంద్రంలో ఘనంగా వన మహోత్సవం

**పచ్చదనం పెంపొందించేందుకు మొక్కలు నాటిన పీఏసీఎస్ చైర్మన్ గూడెం శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు**





**కామారెడ్డి టౌన్ ఆగస్టు 25 ప్రజా జ్యోతి** కామారెడ్డి మండలంలోని పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం) కేంద్రంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో పీఏసీఎస్ ఆవరణలో పలు రకాల మొక్కలను నాటారు.

ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గూడెం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మొక్కలు నాటడం వల్ల వాతావరణ సమతుల్యత కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందుతుందని పేర్కొన్నారు. వన మహోత్సవాన్ని కేవలం కార్యక్రమానికే పరిమితం చేయకుండా నాటిన ప్రతి మొక్కను సంరక్షించి పెద్ద చెట్టుగా పెంచాలని సూచించారు.

వ్యవసాయ రంగంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని, ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. మొక్కల పెంపకం ద్వారా రాబోయే తరాలకు మంచి వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. పీఏసీఎస్ కేంద్రంలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు పాల్గొని మొక్కలు నాటారు. నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించి వాటిని సంరక్షించాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. పీఏసీఎస్ పరిసర ప్రాంతాలను పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గూడెం శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణపై అవగాహన కల్పించారు. పచ్చని వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని వారు పిలుపునిచ్చారు.

# ఈద్ మిలాద్-ఉన్-నబీ ప్రాముఖ్యత




**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 25 (ప్రజా జ్యోతి)** ఈద్ మిలాద్ ఉన్ నబీ పండుగ ఇస్లామిక్ ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి జన్మదినం మరియు వర్ధంతిని స్మరించుకునే పవిత్రమైన రోజు ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం'రబీ-ఉల్-అవ్వల్'ఈ పండుగను ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. దయ, కరుణల సందేశం మహమ్మద్ ప్రవక్త లోకానికి అందించిన ప్రేమ, శాంతి, కరుణ, మరియు సమానత్వం అనే మానవీయ విలువలను ఈ ప్రత్యేకంగా స్మరించుకుంటారు. ప్రత్యేక ప్రార్థనలు మసీదులను, ఇళ్లను అందంగా అలంకరించి అల్లాహ్ ఆరాధనలో మునిగిపోతారు. ప్రవక్త జీవిత చరిత్ర (సీరత్-ఉన్-నబీ) మరియు ఆయన బోధనల గురించి మత పెద్దలు ప్రసంగిస్తారు. మిలాద్ ర్యాలీలు ఽ నాత్ ప్రవచనాలు ప్రవక్త కీర్తిని కొనియాడుతూ 'నాత్' ఆలపిస్తారు. అనేక ప్రాంతాల్లో పవిత్రమైన శాంతి ర్యాలీలను నిర్వహిస్తారు. దానధర్మాలు (సదఖా) పేదలకు, అనాథలకు అన్నదానం చేయడం, దుస్తులు పంపిణీ చేయడం మరియు సహాయం అందించడం ఈ పండుగలో అత్యంత ప్రాధాన్యతని కలిగి ఉంటుంది.

# శబ్దిపూర్‌లో ఘనంగా వన మహోత్సవం

**పచ్చదనం పెంపొందించేందుకు మొక్కలు నాటిన సర్పంచ్ రేకులపల్లి పద్మ**

**ప్రతి ఇంటికి రెండు మొక్కల పంపిణీ**



**కామారెడ్డి టౌన్ ఆగస్టు 25 ప్రజా జ్యోతి** కామారెడ్డి మండలం శబ్దిపూర్ గ్రామంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో గ్రామంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలకు ప్రతి ఇంటికి రెండు మొక్కల చొప్పున పంపిణీ చేసి, వాటిని సంరక్షించి పెంచాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రేకులపల్లి పద్మ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని క్రమం తప్పకుండా సంరక్షించి పెద్ద చెట్లుగా పెంచినప్పుడే వన మహోత్సవ కార్యక్రమానికి సార్థకత చేకూరుతుందని పేర్కొన్నారు. గ్రామంలో పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి కుటుంబం తమ ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటి వాటిని బాధ్యతగా సంరక్షించాలని కోరారు. ప్రతి ఇంటికి రెండు మొక్కలను పంపిణీ చేయడం ద్వారా గ్రామంలోని ప్రతి కుటుంబాన్ని పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములను చేస్తున్నట్లు తెలిపారు. మొక్కల పెంపకంతో భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణం లభిస్తుందని, వర్షాలు సమృద్ధిగా కురవడంతో పాటు పర్యావరణ సమతుల్యతకు చెట్లు ఎంతో దోహదపడతాయని అన్నారు. వన మహోత్సవ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి లింగం, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొని మొక్కలు నాటారు. గ్రామంలో పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలను నాటి సంరక్షించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# వన మహోత్సవంలో మొక్కలు.. పంటలపై పరిశీలన



**గాంధారి, ఆగస్టు 25(ప్రజాజ్యోతి )** గాంధారి మండలంలోని నేరల్ క్లస్టర్ పరిధిలోని నేరల్ గ్రామంలో మంగళవారం వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి రాజా లింగం ఆధ్వర్యంలో వరి పొలాల గట్లపై టేకు మొక్కలను నాటారు.అనంతరం వరి పొలాలను పరిశీలించి పంటలను ఆశిస్తున్న చీడపీడలు, తెగుళ్లను గుర్తించారు. వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు. పంటల్లో తెగుళ్ల లక్షణాలు కనిపించిన వెంటనే తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ దేవి సింగ్, ఉపసర్పంచ్ ఆళ్ల చిన్న సాయిలు , పంచాయతీ కార్యదర్శి రేణుక, ఏఈఓతో పాటు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s SAI KRISHNA PUBLICATIONS, Owned by M/s SAI KRISHNA PUBLICATIONS, Printed at – Sree Seshasai Enterprises, Plot No.98/1, Co-operative Industrial Estate, IDA Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District, Telangana. Published at H.No.3-5-182, Kotagally, Ushaprasad Multiplex back side, Nizambad District-503001, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2010/35558 Phone No. 9440231967

# రాఘవపూర్‌లో ఘనంగా వన మహోత్సవం

**పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి**
**పచ్చదనం పెంపొందించి పర్యావరణ సమతుల్యతను కాపాడాలి**
**నాటిన ప్రతి మొక్కను వృక్షంగా ఎదిగే వరకు సంరక్షించాలి: అదనపు కలెక్టర్ విక్టర్**





**కామారెడ్డి టౌన్ ఆగస్టు 25 ప్రజా** కామారెడ్డి జిల్లా పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రతి కుటుంబం మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని అదనపు కలెక్టర్ విక్టర్ పిలుపునిచ్చారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని ఆయన అన్నారు. వన మహోత్సవాన్ని కేవలం మొక్కలు నాటే కార్యక్రమంగా కాకుండా ప్రకృతి పరిరక్షణకు సంబంధించిన సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలని సూచించారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కామారెడ్డి మండలంలోని రాఘవపూర్ ఆవరణలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ విక్టర్ ముఖ్య అతిథిగా హాజరై స్వయంగా మొక్కలు నాటారు. డీఎఫ్ఓ నీరజ్, డీఆర్‌డీఓ దామోదర్ రెడ్డి, ఎక్సైజ్ శాఖ అధికారి ముకుంద రెడ్డి, గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారులు, గీత కార్మికులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో భాగంగా రాఘవపూర్‌లో మొత్తం 1,200 ఈత మొక్కలను నాటారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఎడ్ల వీనిల నరేష్, ఉప సర్పంచ్ నరేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి మాధవీలత, కామారెడ్డి మండల ఎంపీడీఓ హేబ్సిబ రాణి, ఏపీఓ అన్నపూర్ణ, అంగన్వాడీ సూపర్వైజర్ పద్మజ తదితరులు కూడా మొక్కలు నాటారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, గీత కార్మికులు కలిసి మొక్కలు నాటడంతో కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగింది.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం అత్యంత అవసరమని తెలిపారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, ఉష్ణోగ్రతల పెరుగుదల వంటి సమస్యలను ఎదుర్కోవాలంటే పెద్ద ఎత్తున పచ్చదనాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. చెట్లు ప్రకృతికి రక్షణ కవచంలా పనిచేస్తాయని, పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో అడవులు, మొక్కలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

జిల్లాలో వన మహోత్సవం కింద వివిధ శాఖలకు మొక్కలు నాటే లక్ష్యాలను కేటాయించామని, అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలు, రహదారుల వెంట, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామపంచాయతీ పరిసరాలు, ఇతర అనువైన ప్రాంతాల్లో మొక్కలు నాటి పచ్చదనాన్ని విస్తరించాలని సూచించారు.

మొక్కలు నాటడమే కాదు.. సంరక్షణ కూడా ముఖ్యం

మొక్కలు నాటి వదిలేయడం వల్ల వన మహోత్సవం లక్ష్యం పూర్తికాదని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించి వృక్షంగా ఎదిగేలా చూడాలని అధికారులకు సూచించారు. మొక్కలకు అవసరమైన నీరు అందించడం, పశువుల నుంచి రక్షణ కల్పించడం, మొక్కలు ఎండిపోకుండా తగిన చర్యలు తీసుకోవడం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.

నాటిన మొక్కల మనుగడ శాతాన్ని పెంచేందుకు సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని అన్నారు. మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను గ్రామస్థులు కూడా స్వీకరించాలని కోరారు. ఒక్కొక్కరు ఒక్కో మొక్కను దత్తత తీసుకుని అది పెద్ద చెట్టుగా ఎదిగే వరకు కాపాడితే పర్యావరణ పరిరక్షణకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

ఈత మొక్కలతో పచ్చదనానికి ప్రాధాన్యం

రాఘవపూర్‌లో 1,200 ఈత మొక్కలను నాటడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఈత చెట్ల పెంపకానికి ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఈత చెట్లు పర్యావరణానికి ఉపయోగకరంగా ఉండటంతో పాటు గీత కార్మికుల జీవనోపాధితో కూడా సంబంధం కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. ఈత చెట్ల పెంపకం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కూడా ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.

భావితరాల కోసం పచ్చని భవిష్యత్తు

ప్రస్తుత తరానికి లభిస్తున్న ప్రకృతి వనరులను కాపాడి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు. భవిష్యత్ తరాలు స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన వాతావరణంలో జీవించాలంటే ఇప్పటి నుంచే పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు. పచ్చదనం పెరిగితే వాతావరణంలో ఆహ్లాదకరమైన మార్పులు రావడంతో పాటు ప్రజల ఆరోగ్యానికి కూడా ప్రయోజనం కలుగుతుందని అన్నారు. చెట్లను పెంచడం ద్వారా భూమిపై ఉష్ణోగ్రతలను నియంత్రించడంలో, వర్షపాతం సమతుల్యతను కాపాడటంలో, నేల కోతను అరికట్టడంలో, జీవ వైవిధ్యాన్ని పరిరక్షించడంలో సహాయపడుతుందని వివరించారు.

ప్రభుత్వ శాఖల సమన్వయంతో కార్యక్రమాలు

జిల్లాలో వన మహోత్సవ కార్యక్రమాలను అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో నిర్వహించాలని అదనపు కలెక్టర్ సూచించారు. కేటాయించిన లక్ష్యాలను సాధించడంతో పాటు నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ సిబ్బంది, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వన మహోత్సవం సందర్భంగా పెద్ద సంఖ్యలో మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటి సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఇంటి పరిసరాల్లో, ప్రతి గ్రామంలో వీలైనంత ఎక్కువగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలని సూచించారు.

**అధికారులు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం**

ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ రవితేజ, అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ ఎన్.వై. గిరి, తహసీల్దార్ హిమబిందు, పీడీ మెప్మా శ్రీధర్ రెడ్డి, డీఎఫ్ఓ నీరజ్, డీఆర్‌డీఓ దామోదర్ రెడ్డి, ఎక్సైజ్ శాఖ అధికారి ముకుంద రెడ్డి, అటవీ శాఖ అధికారులు, ఎక్సైజ్ శాఖ అధికారులు, గీత కార్మికులు, గ్రామ సర్పంచ్ ఎడ్ల వీనిల నరేష్, ఉప సర్పంచ్ నరేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి మాధవీలత, ఎంపీడీఓ హేబ్సిబ రాణి, ఏపీఓ అన్నపూర్ణ, అంగన్వాడీ సూపర్వైజర్ పద్మజ, గ్రామపంచాయతీ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాఘవపూర్‌లో 1,200 ఈత మొక్కలను నాటడంతో గ్రామంలో పచ్చదనం మరింత విస్తరించేందుకు అవకాశం ఏర్పడిందని అధికారులు తెలిపారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించి పెద్ద చెట్టుగా ఎదిగేలా గ్రామస్థులు సహకరించాలని కోరారు. పచ్చదనం పెంపొందించడమే కాకుండా మొక్కల సంరక్షణకు ప్రాధాన్యం ఇచ్చినప్పుడే వన మహోత్సవ కార్యక్రమం పూర్తి స్థాయిలో విజయవంతమవుతుందని అధికారులు పేర్కొన్నారు.

# వన మహోత్సవంలో పచ్చదనానికి పెద్దపీట

**లింగయ్యపల్లిలో ఘనంగా వన మహోత్సవం**
**గ్రామ పంచాయతీ ఆవరణ, అంగన్వాడీ కేంద్రంలో మొక్కలు నాటిన సర్పంచ్, రాజయ్య గ్రామస్థులు**



**కామారెడ్డి టౌన్ ఆగస్టు 25 ప్రజా జ్యోతి** కామారెడ్డి మండలం లింగయ్య పల్లి గ్రామంలో పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామాల్లో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమానికి కామారెడ్డి మండలం లింగయ్యపల్లి గ్రామంలో విశేష స్పందన లభించింది. వన మహోత్సవంలో భాగంగా గ్రామ పంచాయతీ ఆవరణ, అంగన్వాడీ కేంద్రం పరిసరాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. గ్రామంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో కార్యక్రమాన్ని నిర్వహించారు.

మొక్కలు నాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలి

ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సర్పంచ్ రాజయ్య మాట్లాడుతూ మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించాలని అన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో చెట్లు కీలక పాత్ర పోషిస్తాయని, గ్రామంలో విస్తృతంగా మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తే పచ్చదనం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. మొక్కలు నాటడానికే కార్యక్రమాన్ని పరిమితం చేయకుండా వాటికి క్రమం తప్పకుండా నీరు అందించి, రక్షణ కల్పించి పెద్ద చెట్లుగా పెంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

ప్రస్తుత కాలంలో వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, పర్యావరణ కాలుష్యం వంటి సమస్యలను ఎదుర్కొనేందుకు చెట్ల పెంపకం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం తమ పరిసరాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, గ్రామంలో ఖాళీగా ఉన్న ప్రదేశాలను గుర్తించి పచ్చదనంతో నింపేందుకు గ్రామ పంచాయతీ తరఫున కృషి చేస్తామని తెలిపారు.

అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ

వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ రాజయ్య సెక్రెటరీ నవనీత గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అందుతున్న సేవలను పరిశీలించారు. పిల్లలకు అందుతున్న పౌష్టికాహారం, కేంద్రం పరిసరాల పరిశుభ్రత, చిన్నారుల హాజరు, మౌలిక వసతులు తదితర అంశాలను పరిశీలించారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణ విషయంలో సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రం పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, చిన్నారులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని తెలిపారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో అంగన్వాడీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

పచ్చదనంతో పాటు పరిశుభ్రతకు ప్రాధాన్యం

గ్రామ పంచాయతీ ఆవరణలో మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. గ్రామంలో నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీటిని అందించడం, పశువుల నుంచి రక్షించడం, మొక్కలు ఎండిపోకుండా సంరక్షించడం వంటి చర్యలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. గ్రామంలో పచ్చదనం పెరిగితే వాతావరణం ఆహ్లాదకరంగా మారడంతో పాటు ప్రజల ఆరోగ్యానికి కూడా మేలు జరుగుతుందని గ్రామ పంచాయతీ పాలకవర్గం పేర్కొంది. ప్రతి ఒక్కరూ వన మహోత్సవంలో భాగస్వాములై కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.

**ప్రజల భాగస్వామ్యంతో కార్యక్రమం**

వన మహోత్సవ కార్యక్రమంలో గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళా సంఘాల సభ్యులు, అంగన్వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు మొక్కలు నాటడంలో భాగస్వాములయ్యారు. గ్రామంలోని ప్రతి ప్రాంతంలో పచ్చదనం పెంపొందించేందుకు ప్రజల సహకారం అవసరమని వారు అన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ రాజయ్య, ఉప సర్పంచ్ శిరీష, గ్రామ పంచాయతీ సెక్రెటరీ నవనీత పాలకవర్గ సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, మహిళా సంఘాల సభ్యులు, అంగన్వాడీ ఆయాలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

లింగయ్యపల్లి గ్రామాన్ని పచ్చదనం, పరిశుభ్రతతో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలను నాటి, వాటిని సంరక్షించాలని ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ పాలకవర్గం పిలుపునిచ్చింది.

## పాల్వంచలో ఘనంగా వన మహోత్సవం

**పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు,అధికారులు**




**పాల్వంచ మండలం, ఆగస్టు 25 ప్రజా జ్యోతి** పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామాన్ని పచ్చదనంతో నింపే లక్ష్యంతో పాల్వంచ గ్రామంలో మంగళవారం వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామంలోని పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కూచని శేఖర్, ఉపసర్పంచ్ సత్యం యాదవ్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ సురేందర్ రెడ్డి పాల్గొని మొక్కలు నాటారు. గ్రామంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని వారు సూచించారు. వన మహోత్సవంలో భాగంగా గ్రామ పంచాయతీ పరిసరాలు, అంగన్వాడీ కేంద్రం, ఇతర ప్రభుత్వ ప్రదేశాల్లో మొక్కలు నాటుతూ వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించాలని, నాటిన మొక్కలను క్రమం తప్పకుండా సంరక్షించి పెద్దవిగా పెంచాలని అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామస్తులకు సూచించారు. గ్రామంలో పచ్చదనం పెరిగితే ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడటంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం అందుతుందని పేర్కొన్నారు. వన మహోత్సవాన్ని కేవలం ఒకరోజు కార్యక్రమంగా కాకుండా నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని, ప్రతి కుటుంబం మొక్కల సంరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి నవీన్, టీఏ సంతోష్, కారోబార్ దేవేందర్, గ్రామ ప్రజలు, అంగన్వాడీ టీచర్లు, ఆయమ్మలు తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులు, అంగన్వాడీ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని మొక్కలు నాటడంతో గ్రామంలో వన మహోత్సవ కార్యక్రమం సందడిగా సాగింది. పచ్చదనం పెంపొందించేందుకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని సర్పంచ్ కూచని శేఖర్ తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి, వాటిని సంరక్షిస్తూ పాల్వంచ గ్రామాన్ని పచ్చని గ్రామంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు.

## ఉగ్రవాయిలో ఘనంగా వన మహోత్సవం

**ఇంటింటికీ రెండు మొక్కల పంపిణీ..**
**పచ్చదనం పెంపునకు శ్రీకారం**




**కామారెడ్డి టౌన్ ఆగస్టు 25 ప్రజా జ్యోతి** కామారెడ్డి మండలం, ఉగ్రవాయి పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామాన్ని పచ్చదనంతో నింపే లక్ష్యంతో ఉగ్రవాయి గ్రామంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వన మహోత్సవంలో భాగంగా గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటి, వాటి సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని గ్రామ ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ రెండు మొక్కలను పంపిణీ చేశారు. ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటి వాటిని బాధ్యతగా సంరక్షించడం ద్వారా గ్రామంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని నిర్వాహకులు తెలిపారు. మొక్కలు నాటడం ఒక్కటే కాకుండా, వాటికి క్రమం తప్పకుండా నీరు అందించి సంరక్షించే బాధ్యతను కూడా ప్రతి కుటుంబం తీసుకోవాలని సూచించారు. మొక్కలు నాటడం వల్ల భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం అందుతుందని, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడంలో చెట్లు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. గ్రామంలోని ఖాళీ ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల వద్ద విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించేందుకు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మహేష్ గౌడ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. వన మహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు గ్రామ ప్రజలు కూడా సహకరించాలని వారు కోరారు. గ్రామాన్ని పచ్చని వనంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## చిన్న మల్లారెడ్డిలో ఘనంగా వన మహోత్సవం

**పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి**




**కామారెడ్డి టౌన్, ఆగస్టు 25 ప్రజా జ్యోతి** పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామాన్ని పచ్చదనంతో నింపే లక్ష్యంతో కామారెడ్డి మండలం చిన్న మల్లారెడ్డి గ్రామంలో మంగళవారం వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వన మహోత్సవంలో భాగంగా గ్రామంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బీమాయల లక్ష్మీరాజు ఆధ్వర్యంలో గ్రామంలో విస్తృతంగా మొక్కలు నాటారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి కుటుంబం తమ వంతు బాధ్యతగా మొక్కలను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి రెండు మొక్కల చొప్పున పంపిణీ చేశారు. మొక్కలను కేవలం నాటడమే కాకుండా వాటిని సంరక్షించి పెద్దవిగా పెంచినప్పుడే వన మహోత్సవం లక్ష్యం నెరవేరుతుందని పేర్కొన్నారు. గ్రామంలో పచ్చదనం పెంపొందించేందుకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిరంతరం కార్యక్రమాలు చేపడతామని సర్పంచ్ తెలిపారు. ఇంటి పరిసరాల్లో మొక్కలు పెంచడం వల్ల స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడటంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని చెప్పారు. ప్రతి కుటుంబం తమకు అందించిన రెండు మొక్కలను బాధ్యతగా సంరక్షించాలని గ్రామ ప్రజలను కోరారు. వన మహోత్సవ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రటరీ రాజేందర్, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు, వివిధ శాఖల అధికారులు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. పాఠశాలల పరిసరాల్లోనూ మొక్కలు నాటి విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. విద్యార్థులు, యువత, మహిళలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటడంతో గ్రామంలో వన మహోత్సవ సందడి నెలకొంది. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, పచ్చని వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందని కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు సూచించారు. చిన్న మల్లారెడ్డి గ్రామాన్ని పచ్చదనంతో నింపేందుకు గ్రామ పంచాయతీ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని గ్రామస్తులు అభినందించారు.

## రాఘవపూర్‌లో ఉచిత వైద్య శిబిరం

**ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి..**
**వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్య సిబ్బంది**

**కామారెడ్డి టౌన్, ఆగస్టు 24 ప్రజా జ్యోతి** కామారెడ్డి మండలం రాఘవపూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు. గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరానికి గ్రామస్థుల నుంచి మంచి స్పందన లభించింది. శిబిరంలో పలువురు గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సమస్యలపై వైద్యులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులు గ్రామ ప్రజల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించి, అవసరమైన వారికి వైద్య సలహాలు అందించారు. సాధారణ అనారోగ్య సమస్యలు, సీజనల్ వ్యాధులు, జ్వరం, రక్తపోటు తదితర ఆరోగ్య సమస్యలపై ప్రజలకు పలు సూచనలు చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, కలుషిత నీరు, అపరిశుభ్రమైన ఆహారం వల్ల వచ్చే అనారోగ్య సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామ సర్పంచ్ ఎడ్ల వీనిల నరేష్ మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామంలో ఎప్పటికప్పుడు ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజలకు వైద్య సేవలను చేరువ చేయవచ్చని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు చిన్నచిన్న ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. గ్రామ ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందించేందుకు సంబంధిత శాఖల సహకారంతో మరిన్ని ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు.